

## షర్మిల వ్యవహారశైలితో పార్టీ నిర్వీర్యం

- విశాఖలో అసమ్మతి నేతల సమావేశం
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ హాజరు
- అగ్రనాయకత్వం దృష్టికి సమస్యను తీసుకువెళతానన్న కిల్లి కృపారాణి

-8లో



సమావేశంలో మాట్లాడుతున్న కిల్లి కృపారాణి

# డిప్యూటేషన్ పేరుతో తిష్ఠ

## రెండేళ్ల నిబంధనకు తూట్లు

- ఏళ్ల తరబడి డీఈవో కార్యాలయంలో పాతుకుపోయిన సబ్జెక్టు టీచర్లు
- డేటా ఆపరేటర్, డేటా కలెక్షన్ వంటి పనులకే పరిమితం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**జిల్లా విద్యా శాఖలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్ ఇష్టారాజ్యం తయారైంది. కొంతమంది గురువులు.. విద్యార్థులకు పాఠాలు బోధించకుండా డీఈవో కార్యాలయం, దీనికి అనుబంధంగా వుండే సమగ్ర శిక్ష కార్యాలయంలో తిష్ఠ వేశారు. రెండేళ్ల డిప్యూటేషన్ నిబంధనను తుంగలో తొక్కి ఏళ్ల తరబడి కార్యాలయంలో పాతుకుపోయారు. పెద్ద మొత్తంలో జీతాలు తీసుకునే టీచర్లను డిప్యూటేషన్లపై నియమించి డేటా ఆపరేటర్, డేటా కలెక్షన్ వంటి చిన్నచిన్న పనులు అప్పగించడం సరికాదనే వాదనలు వినిపిస్తున్నాయి..**

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఉపాధ్యాయుల బదిలీలు, సర్దుబాట్ల ప్రక్రియకు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యా శాఖలోని వివిధ విభాగాల్లో డిప్యూటేషన్‌పై ఏళ్ల తరబడి పనిచేస్తున్న సబ్జెక్టు ఉపాధ్యాయులకు స్థాన చలనం కల్పించి, ఆ స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పించాలనే డిమాండ్లు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులను ఇతరత్రా బాధ్యతల కోసం డిప్యూటేషన్‌పై నియమిస్తే రెండేళ్లు మాత్రమే అవకాశం ఇవ్వాలి. కానీ జిల్లాల పునర్విభజనకు ముందు డిప్యూటేషన్‌పై నియమితులైన పలువురు ఉపాధ్యాయులు ఏళ్లతరబడి అక్కడే కొనసాగుతున్నారు. వీరిలో గణితం, ఇంగ్లిషు, సైన్స్ వంటి ముఖ్య సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు ఉండడం గమనార్హం. ఎస్.రాయవరం మండలంలో పనిచేయాల్సిన ఒక గణితం ఉపాధ్యాయుడు దాదాపు పదేళ్ల నుంచి జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఏఎస్‌ఓగా కొనసాగుతున్నారు. ఎలమంచిలి మండలంలోని ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్టు జీతం డ్రా చేస్తున్న మరో టీచర్ డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

### సమగ్ర శిక్ష విభాగంలో..

జిల్లా విద్యా శాఖకు అనుబంధంగా వుండే సమగ్ర శిక్ష విభాగం అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పోస్టులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక లెక్చరర్ డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. ఇదే కార్యాలయంలో ఏఎస్‌ఓగా కె.కోటపాడు మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు, బాలికా విద్యాభివృద్ధి అధికారిగా రాంబిల్లి మండలం నుంచి స్కూల్ అసిస్టెంట్ స్థాయి ఉపాధ్యాయిని డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్‌గా ఎస్.రాయవరం

... మిగతా 8వ పేజీలో



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

## టీచర్ల బదిలీలకు సర్వం సిద్ధం

- 4,811 మందికి స్థాన చలనం
- ఐదు/ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తిచేసినవారు 2,121 మంది
- సర్దుబాటు ద్వారా ఏర్పడిన ఖాళీలు 1,851
- ఇప్పటికే ఉన్న ఖాళీలు 780

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నంజిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన కసరత్తును విద్యా శాఖ పూర్తిచేసింది. అన్ని కేటగిరీలు కలిపి 4,811 మందికి బదిలీ కానున్నది.ఉమ్మడిజిల్లాలో జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్ పాఠశాలల్లో సుమారు 15 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా వారిలో మూడో వంతు టీచర్లు ప్రస్తుతం పనిచేసేచోట నుంచి మరో చోటకు వెళ్లనున్నారు. జీవో 117 రద్దు చేసిన కూటమి ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు సిద్ధమైంది. ఉమ్మడి జిల్లాలో ఏడు రకాల పాఠశాలలు ఏర్పాటుకానున్నాయి. దీనికి అనుగుణంగా విద్యార్థి, టీచర్ నిష్పత్తిని పరిగణనలోకి తీసుకున్న విద్యా శాఖ అధికారులు 1,851పోస్టులను ఒక చోట నుంచి మరోచోటకు సర్దుబాటు చేశారు. సర్దుబాటు ద్వారా పోస్టు బదలాయింపు జరిగిన చోట కొత్తగా టీచర్లను నియమించాల్సి ఉంటుంది. దీంతో 1,851 మంది టీచర్లకు స్థాన చలనం కలగనున్నది. ఇక ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన స్కూలు అసిస్టెంట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ టీచర్లు 2,121 మంది ఉన్నట్టు గుర్తించారు. దీంతో వారందరికీ తప్పనిసరిగా బదిలీ జరగనున్నది. అలాగే పదవీ విరమణ, పదోన్నతి పొందిన, మరణించిన లేదా ఇతర కారణాల వల్ల 780 ఖాళీలు న్నట్టు గుర్తించారు. త్వరలో జరగనున్న బదిలీల్లో ఆ780 పోస్టులను భర్తీచేస్తారు. దీర్ఘకాలిక సెలవుపై విదేశాలకు వెళ్లిన టీచర్లు ఐదుగురు, స్టడీ లీవ్‌పై వెళ్లిన 51 మంది, విధులకు గైర్హాజరైన టీచర్లు ముగ్గురి స్థానాలను కూడా బదిలీల ద్వారా భర్తీచేస్తారు. కాగా ఎంతమందికి స్థానచలనం కలుగుతుందన్న దానిపై ఇప్పటికే నివేదిక రూపొందించామని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మొత్తం 4,811మంది టీచర్లకు స్థాన చలనం కలుగుతుందన్నారు.

# సాగునీటికి భరోసా

## పంట కాలువలకు మహర్దశ

- ఉపాధి హామీ పథకం కింద పూడిక తీత, తుప్పల తొలగింపు
- జిల్లాలో రూ.19.85 కోట్లతో 558 పనులు
- మరో నెల రోజుల్లో పూర్తయ్యేలా అధికారులు కృషి
- అన్నదాతలకు తీరనున్న సాగునీటి కష్టాలు



దేవరాపల్లి మండలం ఎన్‌జీనగరంలో పూడికతీయక ముందు పంట కాలువ

నర్సీపట్నం. మే 19 (ఆంధ్రజ్యోతి):

**సాగునీటి కాలువల్లో ఎట్టకేలకు ఆరేళ్ల తరువాత నిర్వహణ పనులు జరుగుతున్నాయి. ఉపాధి హామీ పథకం నిధులతో కాలువల్లో పూడిక తీత, తుప్పలు తొలగింపు, మదుములకు మరమ్మతు వంటి పనులు చేపట్టారు. రిజర్వాయర్లు, చెరువుల ఆయకట్టుకు సంబంధించి సుమారు రూ.20 కోట్లతో 558 పనులు చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే పలు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను మరో నెల రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.**

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో అన్ని రంగాల మాదిరిగానే సాగునీటి వ్యవస్థను సైతం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. జలాశయాల ఆయకట్టు కాలువలు, ఆనకట్టలు, చెరువుల మదుములు, పంట కాలువల నిర్వహణను గాలికొదిలేసింది. ఒక్క ఏడాది కూడా నిర్వహణ, మరమ్మతు పనులు చేయించిన పాపానపోలేదు. దీంతో కాలువల్లో పూడిక పేరుకుపోయి, తుప్పలు పెరిగిపోయాయి. నీటి ప్రవాహం సక్రమంగా జరగక, చివరి భూములకు నీరు అందని పరిస్థితి నెలకొంది. చెక్ డ్యాములు, ఆనకట్టకు మరమ్మతు పనులు చేయకపోవడంతో నదిలో నుంచి కాలువలకు నీరు ప్రవహించేది కాదు. మదుములు పాడైపోవడంతో నీరు వృథాగా పోతున్నది. సాగునీటి వనరులకు నిర్వహణ, అభివృద్ధి పనులు చేయాలని రైతులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఇరిగేషన్ అధికారులు ఏటా నిధుల కోసం ప్రతిపాదనలు చేయడం, వాటిని ప్రభుత్వం బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో అన్నదాతలు విసిగిపోయి, కొన్నిచోట్ల శ్రమదానంతో పూడికలు తీసి, తుప్పలు

... మిగతా 8వ పేజీలో



తుప్పలు తొలగించి, పూడిక తీసిన తరువాత...

| మండలం | పనులు | నిధులు |
|---|---|---|
| అనకాపల్లి | 54 | రూ.1.37 కోట్లు |
| అచ్యుతాపురం | 19 | రూ.83 లక్షలు |
| బుచ్చెయ్యపేట | 22 | రూ.45 లక్షలు |
| చోడవరం | 19 | రూ.88 లక్షలు |
| దేవరాపల్లి | 19 | రూ.67 లక్షలు |
| కె.కోటపాడు | 11 | రూ.38 లక్షలు |
| కశింకోట | 30 | రూ.97 లక్షలు |
| కోటవురట్ల | 4 | రూ.11 లక్షలు |
| మాడుగుల | 58 | రూ.2.35 కోట్లు |
| మాకవరపాలెం | 10 | రూ.40 లక్షలు |
| మునగపాక | 37 | రూ.1.77 కోట్లు |
| నక్కపల్లి | 11 | రూ.44 లక్షలు |
| నాతవరం | 26 | రూ.1.06 కోట్లు |
| పాయకరావుపేట | 33 | రూ.1.13 కోట్లు |
| రాంబిల్లి | 4 | రూ.15 లక్షలు |
| రావికమతం | 13 | రూ.52 లక్షలు |
| రోలుగుంట | 5 | రూ.8 లక్షలు |
| ఎస్.రాయవరం | 131 | రూ.4.15 కోట్లు |
| సబ్బవరం | 16 | రూ.67 లక్షలు |
| ఎలమంచిలి | 23 | రూ.89 లక్షలు |
| చీడికాడ | 21 | రూ.85 లక్షలు |

# ముత్యాలమ్మపాలెంలో హత్య

## బాకీ తీర్చే విషయంలో ఇద్దరి మధ్య గొడవ



హత్యకు గురైన బంగార్రాజు.. (ఫైల్‌ఫొటో)

- అప్పు ఇచ్చిన వ్యక్తిపై రుణగ్రహీత బంధువు కత్తితో దాడి
- శరీరంపై పలుచోట్ల విచక్షణారహితంగా కత్తిపోట్లు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- ప్రధాన నిందితుడితోసహా ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పరవాడ, మే 19 (ఆంధ్రజ్యోతి):

**అప్పు విషయమై జరిగిన గొడవ ఒక యువకుడి హత్యకు దారితీసింది. అప్పు ఇచ్చిన వ్యక్తిని, అప్పు తీసుకున్న వ్యక్తి బంధువు కత్తితో దారుణంగా పొడిచి చంపేశాడు. మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.**

ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి బంగార్రాజు(30) సింహాద్రి ఎన్టీపీసీలో మెయింటెన్స్ కార్మికుడుగా పని చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన చింతకాయల యర్రయ్య కొన్నాళ్ల క్రితం బంగార్రాజు వద్ద రూ.63 వేలు అప్పుగా తీసుకున్నాడు. తరువాత దఫ దఫాలుగా బాకీ తీరుస్తున్నాడు. ఇప్పటి వరకు రూ.45 వేలు తిరి గి చెల్లించగా ఇంకా రూ.18 వేలు ఇవ్వాల్సి ఉంది. తనకు డబ్బు అవసరం ఏర్పడిందని, సత్వమే ఇవ్వాలని బంగార్రాజు కొంతకాలంగా అడుగుతుండగా ఇదిగో... అదిగో.. అంటూ యర్రయ్య కాలయాపన చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ముత్యాలమ్మపాలెం శివారు సమ్మంగపాలెంలో జరిగిన వివాహం వేడుకకు ఇద్దరూ హాజరయ్యారు. బంగార్రాజు బాకీ విషయమై యర్రయ్యను నిలదీశాడు. దీంతో ఇరువురి గొడవ జరిగింది. తరువాత ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో బంగార్రాజుకు యర్రయ్య ఫోన్ చేసి డబ్బులు ఇవ్వను నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు. బంగార్రాజు ఫోన్‌లో మాట్లాడుతూనే యర్రయ్య వద్దకు చేరుకున్నాడు. ఇద్దరి మధ్య మరోసారి గొడవ మొదలైంది. ఈ క్రమంలో యర్రయ్యకు వరుసకు అక్క, బావ అయిన కొవిరి ముత్యాలు, కొవిరి ముత్యాలమ్మ, మేనల్లుళ్లు కామరాజు, శివాజీ, అదే కుటుంబానికి చెందిన ఆర్మీ ఉద్యోగి ముత్యాలు, వాసుపల్లి ప్రవీణ్‌కుమార్ కలిసి బంగార్రాజుతో గొడవకు దిగారు. కామేశ్ అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో బంగార్రాజుపై దాడి చేసి శరీరంపై పలుచోట్ల పొడిచాడు. ఇతనికి శివాజీ సహకరించాడు. ఈ సంఘటనపై బంగార్రాజు కుటుంబ సభ్యులు వెంటనే పరవాడ పోలీసులకు సమాచారం అందించి, క్షతగాత్రుడిని ఆటోలో ఎక్కించుకుని చికిత్స నిమిత్తం గాజువాక బయలుదేరారు. పరవాడలో ఒక కానిస్టేబుల్ వీరితోపాటు ఆటోలో ఎక్కారు. బంగార్రాజును గాజువాకలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. కొద్దిసేపటి తరువాత సీఐ మల్లికార్జునరావు చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడిన అనంతరం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తరువాత సీఐ పరవాడ వెళ్లి, డీఎస్పీ విష్ణుస్వరూప్‌తో కలిసి ముత్యాలమ్మపాలెం వెళ్లారు. హత్యకు గురైన బంగార్రాజు కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతోపాటు స్థానికులు తెలిపిన వివరాల మేరకు ప్రధాన నిందితుడు కామరాజు పాటు

... మిగతా 8వ పేజీలో



ప్రధాన నిందితుడు కొవిరి కామరాజు (ఫైల్‌ఫొటో)

## 22న జిల్లాస్థాయి మహానాడు

- అడ్డరోడ్డులోని ఒక ప్రైవేటు లేఅవుట్‌లో ఏర్పాట్లు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి):



బత్తుల తాతయ్యబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు జం క్షన్ వద్ద వున్న ఒక ప్రైవేటు లేఅవుట్ ప్రాంగణంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న జిల్లాస్థాయి మహానాడుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నట్టు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు చెప్పారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా స్థాయి మినీ మహానాడులో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. వార్డుస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని రకాల కమిటీలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులతోపాటు సానుభూతిపరులు జిల్లా మహానాడుకు హాజరు కావాలని కోరారు.

# సుజల స్రవంతి సర్వే పనులకు బ్రేక్

## తోటకూరపాలెం ప్రాంతంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

ప్రభుత్వ భూముల సర్వేకు వెళ్లిన రెవెన్యూ, సర్వే సిబ్బందిని అడ్డగించిన గ్రామస్థులు

- ఉన్నతాధికారులు తమతో చర్చలు జరపాలని డిమాండ్
- సర్వే చేయకుండానే వెనుతిరిగిన సిబ్బంది

రావికమతం, మే 19 (ఆంధ్రజ్యోతి):

**ఉత్తరాంధ్ర సుజల స్రవంతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు భూ సర్వే కోసం వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని మండలంలోని తోటకూరపాలెం గ్రామస్థులు అడ్డుకున్నారు. తమ అంగీకారం లేకుండా సర్వే ఎలా చేపడతారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ఇక్కడకు వచ్చి తమతో చర్చలు జరపాలని, ఆ తరువాతే సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది వెనుతిరిగారు.**

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగా బుచ్చెయ్యపేట మండలం పెదపూడి, పంగిడి, రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామాల పరిధిలో సుమారు 1,100 ఎకరాల్లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలన్నది ప్రణాళిక. తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో చివరి ఏడాది ఇక్కడ రిజర్వాయర్ పనులకు ప్రతిపాదించారు. పనులు చేపట్టే తరుణంలో రైతులు అభ్యంతరం తెలిపారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సుజల స్రవంతి పథకంతోపాటు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం గురించి ఐదేళ్లపాటు పట్టించుకోలేదు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సుజల స్రవంతి పథకంలో కదలిక వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో రావికమతం తహసీల్దార్ బి.వెంకటరమణ సోమవారం సర్వే సిబ్బంది, వీఆర్వోలను తోటకూరపాలెంలో సర్వే చేసి ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలు, వాగులను గుర్తించాలని ఆదేశించారు. దీంతో సర్వే సిబ్బందితోపాటు తోటకూరపాలెం, టి.అర్జాపురం, చీమలపాడు వీఆర్వోలు డొంకా అప్పారావు, బి.రాజు, సింహాద్రి తదితరులు తోటకూరపాలెం వెళ్లి భూలోకమ్మ గుడి దగ్గర నుంచి సర్వే పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్థులు అక్కడకు వెళ్లి తమ ఆమోదం లేకుండా సర్వే చేయడం ఏమిటంటూ అడ్డగించారు. ఎడ్ల కృష్ణ, బోని సింహాచలం నాయుడు, చింతి అచ్చిబాబు తదితరులు వారితో వాగ్వాదానికి దిగారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఇతర అధికారులు ఇక్కడకు వచ్చి గ్రామస్థులతో చర్చలు జరిపి, తమ అంగీకారంతో సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. దీంతో సర్వే సిబ్బంది ఈ విషయాన్ని తహసీల్దారు బి.వెంకటరమణకు ఫోన్ చేసి చెప్పారు. ఆయన ఫోన్‌లో రైతులతో కూడా మాట్లాడారు. ప్రస్తుతం సర్వే ద్వారా ప్రభుత్వ భూములను మాత్రమే గుర్తిస్తామని, రైతుల భూముల జోలికి వెళ్లబోమని, సర్వే కూడా చేయరని చెప్పారు. అయినా సరే రైతులు ఒప్పుకోలేదు. ముందు తమతో చర్చలు జరిపి, నష్టపరిహారం తేలిన తరువాతే సర్వే చేయాలని స్పష్టం చేశారు. దీంతో సర్వే, రెవెన్యూ సిబ్బంది వెనుతిరిగారు.



సర్వే, రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న తోటకూరపాలెం గ్రామస్థులు

## సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

'పేట మండలం పెంటకోట బీచ్‌లో ఘటన

పాయకరావుపేట రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెంటకోట వద్ద సముద్రంలో ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న మెరైన్ పోలీసులు.. గజఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. గంటలపాటు గాలించినా ఆచూకీ లభించలేదు. విద్యార్థుల గల్లంతుకు సంబంధించి సీఐ జి.అప్పన్న అందించిన వివరాలిలా వున్నాయి.

పాయకరావుపేట పట్టణంలోని పాత హరిజనవాడకు చెందిన గంపల తరీశ్ (17) ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేశాడు. ఇతని దగ్గర బంధువైన అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి గ్రామానికి చెందిన పిల్లి అభిలాష్ (19) హైదరాబాద్‌లో డిగ్రీ ఫస్ట్ ఇయర్ పూర్తి చేశాడు. వీరిద్దరూ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి పాయకరావుపేటలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. సాయంత్రం అంతా కలిసి మండలంలోని పెంటకోట బీచ్‌కి వెళ్లారు. సముద్రంలో దిగి సరదాగా గడుపుతుండగా పిల్లి అభిలాశ్ ఆకస్మికంగా ఎగిసిన కెరటం ధాటికి నీటిలో మునిగిపోయాడు. ఇతనిని కాపాడేందుకు తరీశ్ సముద్రంలో మరింత ముందుకు వెళ్లారు. అయితే అలల తాకిడికి ఇద్దరూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. మిగిలిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మెరైన్ పోలీసులు, గజఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 20 మంది రెండు గంటలపాటు గాలించినా ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపు చర్యలు ఆపేశారు. మంగళవారం ఉదయం ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రప్పించి గాలింపును కొనసాగిస్తామని సీఐ అప్పన్న తెలిపారు.



పిల్లి అభిలాష్ (ఫైల్ ఫొటో)



గంపల తరీశ్ (ఫైల్ ఫొటో)



## నేడు దుప్పితూరులో చిట్టిపైడితల్లి జాతర

అచ్యుతాపురం రూరల్, మే 19 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని దుప్పుతూరు గ్రామంలో కొలువై ఉన్న చిట్టి పైడితల్లి అమ్మవారి జాతరను ఈనెల 20న ఘనంగా నిర్వహిస్తున్నట్టు గ్రామ నాయకులు శెట్టి చిరంజీవి, దేశంశెట్టి ఎల్లయ్యా నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి జాతరకు అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్టు వారు తెలిపారు. జాతర సందర్భంగా ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మెగా మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసి సిని ప్రముఖులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

## ధ్యానంతో ప్రశాంతత



ధ్యానంలో శిక్షణ పొందుతున్న పిల్లలు

నక్కపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): రోజూ క్రమం తప్పకుండా ధ్యానం, ప్రాణాయామం, యోగాసనాలు చేయడం ద్వారా చక్కని ఆరోగ్యంతోపాటు, ప్రశాంతత చేకూరుతుందని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయాధికారి కె.జనార్దన్ చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరంలో బాగంగా సోమవారం ధ్యానం, యోగాసనాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని వృథా చేయకుండా ఇంటి వద్ద కూడా యోగాసనాలు, ధ్యానం చేయాలన్నారు.

## నేడే తంగేడు తలుపులమ్మ జాతర

కోటవురట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త తంగేడులో గ్రామదేవత తలుపులమ్మ పండుగ మంగళవారం జరగనుంది. ప్రధాన ద్వారం నుంచి గ్రామం వరకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభవుతాయని నిర్వాహకులు తెలిపారు.

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

పాయకరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వీరి కోసం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు తెలుగు పరీక్ష నిర్వహించగా 50 మందికి 29 మంది విద్యార్థులు హాజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ కేవీఎన్.గాంధీ తెలిపారు.

## నేడు వాడ్రాపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

మునగపాక, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడ్రాపల్లిలో ఈనెల 20వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. రామాలయం వద్ద మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటికి సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తారన్నారు.

## అసంపూర్తిగా దుకాణ సముదాయ భవనం

రాంబిల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): నిధుల కొరతతో రాంబిల్లిలోని దుకాణ సముదాయ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఏళ్ల క్రితం ఎంఎంఎస్ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో స్థానిక ఎంపీడీవో కార్యాలయం పక్కనే చెరువు గట్టుపై ఈ భవన నిర్మాణ పనులు చేపట్టారు. రెండు భవనాలుగా విభజించి ఒక దానికి శ్లాబ్ వేయగా మరొక భవనానికి శ్లాబ్ వేయకుండానే పనులు నిలిచిపోయాయి.ఈ పనులకు సంబంధించి రూ.7లక్షలు మంజూరయ్యాయి. మిగిలిన సొమ్ము మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులను నిలిపివేశారు. కాగా అసంపూర్తిగా ఉన్న దుకాణ సముదాయం చుట్టూ తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. శ్లాబ్ పూర్తయిన 7 గదులను స్థానికులైన కొందరు తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. సుమారు 20 ఏళ్లగా పనులు నిలిచిపోయిన సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

## దేవరాపల్లి వైస్ ఎంపీపీగా సింహాచలంనాయుడు

దేవరాపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ వైస్ ఎంపీపీ-1గా మామిడిపల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచాడ సింహాచలంనాయుడును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు, ఏవో లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో జరిగింది. ఎన్నికైన సింహాచలంనాయుడును అధికారులు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ, జడ్పీటీసీ కర్రి సత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, అభినందించారు.

# పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి




అచ్యుతాపురం రూరల్: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎలమంచిలిలో పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

అచ్యుతాపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్‌లో సోమవారం కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులల్పించారు. కార్యక్రమంలో సీపీఎం కన్వీనర్ ఆర్. రాము, సీపీఎం మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, నేతలు చోడిపల్లి అప్పారావు, బి.రామ్‌కుమార్‌నాయుడు, తట్టారాజు, నాయుడు పాల్గొన్నారు.

**మునగపాకలో..**

ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన వారిలో స్వర్గీయ పుచ్చలపల్లి సుందరయ్య ఒకరని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని గవర్ల అనకాపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం పుచ్చలపల్లి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఆడారి రామలక్ష్మి, మళ్ల సత్యనారాయణ, ప్రసాద్, దొడ్డి తేజ, ఆళ్ల సూరిబాబు, బాలు తదితరులు పాల్గొన్నారు.

**రాంబిల్లిలో..**

కమ్యూనిస్టు ఉద్యమకారుడు పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతిని సోమవారం రాంబిల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, చినకవలాపల్లి సర్పంచ్ వై.శ్రీనివాసరావు, సీపీఎం మండల కమిటీ సభ్యులు డి.కాశియ్య, వై.రాము, సీహెచ్ పవన్‌కుమార్, కె.నూకరత్నం, జి.లక్ష్మి, వై.అప్పారావు, సీహెచ్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఎలమంచిలిలో..**

పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, స్థానిక నాయకులతో కలిసి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు ఎం.రమణ, పి. జానకి, కూర్మారావు, నాయుడు పాల్గొన్నారు.

**నక్కపల్లిలో..**

బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన పోరాట యోధుడు దివంగత పుచ్చలపల్లి సుందరయ్య అరి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు చెప్పారు. సోమవారం నక్కపల్లి సీఐటీయూ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేశ్, వీధి కన్నారావు, అయినవెల్లి లోవరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరంలో..**

మండలంలోని ధర్మవరం అగ్రహారం, వేమగిరి గ్రామాల్లో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కోసం తన ఆస్తులు, జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శమూర్తి అని అన్నారు.



ఎస్.రాయవరం: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడుతున్న సత్యనారాయణ



నక్కపల్లిలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

# మునగపాక ఉప సర్పంచ్ ఎన్నికకు ముఖం చాటేస్తున్న వైసీపీ

- 14 మందిలో 12 మంది వార్డు సభ్యులు వారే
- మూడోసారి కూడా ముందుకు రాని వైనం



ఎన్నిక నిర్వహణ కోసం విచ్చేసిన అధికారులు

మునగపాక, మే 19 (ఆంధ్రజ్యోతి): మునగపాక గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక మూడోసారి కూడా ఆగిపోయింది. 14 మంది వార్డు సభ్యులకు 12 మంది వైసీపీకి చెందినవారే ఉన్నప్పటికీ ఎన్నికకు హాజరు కావడం లేదు. మార్చి 27వ తేదీన ఉప సర్పంచ్ ఎన్నిక సభ్యులు ఎవరు హాజరు కాకపోవడంతో అదే నెలలో 28వ తేదీకి వాయిదా వేశారు. అప్పుడు కూడా ఎవరూ రాకపోవడంతో తిరిగి సోమవారం ఎన్నిక జరుగుతుందని ఎన్నికల అధికారి దీపిక ప్రకటించారు. సభ్యులు ఎవరు రాకపోవడంతో నిర్దేశించిన సమయం వరకు ఉండి ఆమె వెళ్లిపోయారు. దీంతో మూడోసారి కూడా ఎన్నిక జరగలేదు. గత పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ నేతలు కన్నబాబురాజు, బొడ్డేడ ప్రసాద్ వర్గాలుగా విడిపోయి బరిలో నిలబడ్డారు. పోటీ ఉత్కంఠభరితంగా జరిగినప్పటికీ ఫలితాలు మాత్రం ఏకపక్షంగానే నిలిచాయి. సర్పంచ్‌తో సహా 14 వార్డుల్లో బొడ్డేడ ప్రసాద్ మద్దతుదారులే ఘన విజయం సాధించారు. అట్టహాసంగా కొలువుదీరిన పాలకవర్గంలో పెంటకోట సత్యనారాయణను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. రెండున్నర సంవత్సరాలు తరువాత ఒప్పందంలో భాగంగా సత్యనారాయణ రాజీనామా చేయడంతో ఉప సర్పంచ్‌గా బొడ్డేడ అప్పలనాయుడును ప్రకటించారు. అయితే అప్పలనాయుడు సార్వత్రిక ఎన్నికలు సమయంలో జనసేన పార్టీలో చేరారు. దాంతో వార్డు సభ్యులంతా తిరిగి సత్యనారాయణకు మద్దతుగా నిలవడంతో రాజీనామా ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. అతని రాజీనామా అప్పటికే ఆమోదం కావడంతో తిరిగి అవకాశం లభించలేదు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉపసర్పంచ్ పదవికి ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 14 మందిలో కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే జనసేనలో ఉన్నారు. మిగిలిన 12 మంది ప్రసాద్ అనుచరులుగానే ఉన్నారు. ప్రసాద్ ఉపసర్పంచ్‌గా ఎవరిని ప్రతిపాదిస్తే వారికి సంపూర్ణ మద్దతు ఇవ్వడానికి 12 మంది సభ్యులు సిద్ధంగా ఉన్నా ఎన్నికకు నోచుకోవడం లేదు. అన్ని విధాలుగా అవకాశం ఉన్న వైసీపీ ఎందుకు దోబూచులాడుతుందో అర్థం కావడం లేదు. కాగా సోమవారం సర్పంచ్‌తోపాటు కోరంనకు సరిపడా వార్డు సభ్యులు పంచాయతీ కార్యాలయానికి వచ్చి సర్పంచ్ చాంబర్‌లో బొడ్డేడ ప్రసాద్ సమక్షంలో మాట్లాడుకొని వెళ్లిపోయారు.

## ఫ్లోరోసిస్ పట్ల అవగాహన పెంచుకోవాలి

కోటవురట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి):ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి విశాఖ జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఫ్లోరోసిస్ విభాగం కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాథ్ అన్నారు, సోమవారం మండలంలోని లింగాపురం, తంగేడు, యండపల్లి, టి.జగ్గంపేట, సుంకపూర్, కోటవురట్ల గ్రామ సచివాలయాల్లో పర్యటించారు. ఈ వ్యాధికి గురైన వారికి గతంలో పునరావాస పరికరాలు, కుర్చీలు, చేతికర్రలు, నడుము, మెడ పట్టీలు పంపిణీ చేశారు. ఈ పరికరాలు వినియోగంపై ఆరా తీసి అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్ వ్యాధి అనుమానితులను పరిశీలించారు. ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు కాళ్లు, చేతులు వంకర పోవడం, పళ్లగార పట్టడం, వెన్నుపూస, మెడ వంగకపోవడం, ఎర్ర రక్తకణాలు తగ్గిపోవడం, ఎక్కువగా యూరిన్ వెళ్లడం, దాహం తీసుకున్న ఆహారం జీర్ణం కాకపోవడం ఉంటుందన్నారు. మండలంలో 12గ్రామాల్లో నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిమిత్తం తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో గోవిందరావు, వైద సిబ్బంది పాల్గొన్నారు.



యండపల్లి సచివాలయంలో ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# అనకాపల్లిలో యాదవ సామాజిక భవనం నిర్మించాలి

- చైర్మన్‌కు రంగనాయకులు వినతి

ఎలమంచిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో యాదవ సామాజిక భవనం ఏర్పాటుకు కృషి చేయాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్‌ను డైరెక్టర్ దూళి రంగనాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో నరసింహ యాదవ్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్టు రంగనాయకులు తెలిపారు. ఇటీవల జిల్లా ప్రతినిధులు కలిసి యాదవ సామాజిక భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం కృషి చేయాలని కోరారన్నారు. సామాజిక భవనం విషయాన్ని రాష్ట్ర చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేలతో మాట్లాడి స్థలం మంజూరుకు కృషి చేస్తానని చైర్మన్ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో హరిపురం పాలసంఘం ప్రెసిడెంట్ దూళి అప్పారావు, తెలుగు యువత సభ్యులు పరమేశ్, గణేశ్ పాల్గొన్నారు.



తిరుపతిలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న రంగనాయకులు

## ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు

- ఉత్తమ రైతులకు ఘన సత్కారం



ఉత్తమ రైతులను సన్మానించిన టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని టీడీపీ నాయకుడు చించెలపు ప్రదీప్ అన్నారు. సోమవారం మండలంలోని శ్రీరామపురంలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకం తగ్గి భూమి సారవంతంగా మారడంతోపాటు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, నాణ్యమైన పంటను పొందవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్న పలువురు ఉత్తమ రైతులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌రాజు, పెరుమాళ్ల గణపతి, మందపాటి శ్రీనివాసరాజు, గంగిరెడ్ల బంగారమ్మ, గొర్ల నూకరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జోగారావు, దేవి, పద్మ, చందన, వీరమణి పాల్గొన్నారు.

## జిల్లా మహానాడుని విజయవంతం చేయండి

- టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు

పాయకరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22వ తేదీన అడ్డురోడ్డులో నిర్వహించే జిల్లా స్థాయి మహానాడు విజయవంతం అయ్యేలా పార్టీ శ్రేణులు కృషిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22వ తేదీన అడ్డురోడ్డులో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మహానాడు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలివచ్చేందుకు గ్రామస్థాయి నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు వంకా వెంకటరమణ, బొంది కాశీవిశ్వనాథం, యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, వేములపూడి అప్పారావు, ఎం.రమాకుమారి, కట్టా శ్రీను, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు ఎలమంచిలిలో మినీ మహానాడు

- పట్టణ వీధుల్లో తిరంగా ర్యాలీకి ఏర్పాట్లు

ఎలమంచిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మినీ మహానాడును నిర్వహించేందుకు టీడీపీ నేతలు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో జరగనున్న మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుల ఆధ్వర్యంలో జరుగుతున్న మినీ మహానాడుకు గురవప్ప కల్యాణ మండపంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొంటారని తెలిపారు. అంతకుముందు పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

## ఘనంగా గంగాదేశి అమ్మవారి జాతర

రాంబిల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో కొలువైన గంగాదేవి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శీరా వెంకటరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆమ్మవారి ఆలయ ప్రాంగణంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శీరా నర్సింగరావు (నేవీ) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శీరా మహాలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వెంకటాపురం ఎమ్మెల్యే ఆఫీసులో జనవాణి రేపు

రాంబిల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 21న రాంబిల్లి మండలం వెంకటాపురం వద్ద గల ఎమ్మెల్యే కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ అచ్యుతాపురం మండల అధ్యక్షుడు బి.శ్రీరామదాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, అధికారులతో కలిసి ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగనుందన్నారు. సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకునేవారు వారి అర్జీలపై ఫోన్, ఆధార్ నంబర్లు వేసి తీసుకురావాలని కోరారు.

## అత్తిలివారి చేలులో కనీస వసతులు కల్పించాలి

ఎలమంచిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ ఏర్పడి 12 ఏళ్ల కావస్తున్నా నేటికీ తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యానికి నోచుకోలేదని 18వ వార్డులోని అత్తిలివారి చేలు వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టరుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్టు ఆ ప్రాంత వాసులు తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోటబ్జేజీ సమస్య ఉందని ఎన్ని పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రహదారి నిర్మాణం చేపట్టలేదని, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తెచ్చారు.

## 'కార్యకర్తల అభీష్టం మేరకు మండల అధ్యక్షుడి ఎన్నిక జరపాలి'



టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నేతలు

అచ్యుతాపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల అభీష్టం మేరకు అచ్యుతాపురం టీడీపీ మండల అధ్యక్ష ఎన్నిక నిర్వహించాలని మండలంలోని పలు గ్రామాల టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు కోరారు. సోమవారం వీరు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడా నాగేశ్వరరావులను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ఏకపక్షంగా పీడీ తులసీరాంను టీడీపీ మండల అధ్యక్షుడుగా ఎన్నికైనట్టు ప్రకటించడం అన్యాయమన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న నాయకుడిని గుర్తించి మండల బాధ్యతలు అప్పగించాలన్నారు. చంద్రబాబుని జైల్లో పెట్టిన సందర్భంలో తులసీరాం ఎప్పుడూ పోరాటం చేయలేదన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన జనపరెడ్డి నర్సింగరావుకు అవకాశం ఇవ్వాలని వీరు కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మామిడి శివ అప్పారావు, కె.మహేష్, నాగేశ్వరరావు, వెంటకరావు, రమణ పాల్గొన్నారు.

## 'గృహ నిర్మాణానికి పరిహారం ఇవ్వాలి'



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బార్క్ నిర్వాసితులు

అచ్యుతాపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): బార్కు నిర్వాసితులకు పునరావాసం కల్పించి గృహ నిర్మాణానికి రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని జడ్పీటీసీ కో- ఆప్షన్ సభ్యులు నర్మాల కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రావిపాలెం బార్కు నిర్వాసితులతో కలిసిన కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. డి పట్టాదారులకు ఎకరాకు రూ. 60 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, బార్కులో గల పాఠశాలలు, ఆసుపత్రులలో నిర్వాసితులకు ప్రవేశాలు కల్పించాలని కోరారు.

## 50వ రోజుకు చేరిన ఉచిత మజ్జిగ పంపిణీ



ఆటో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఈ ఏడాది పట్టణంలో ఏర్పాటుచేసిన ఉచిత మజ్జిగ పంపిణీ సోమవారానికి 50వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బాలేపల్లి చినబాబు, అధ్యక్షుడు టెక్కలి వెంకటరామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున ఏప్రిల్ నెల 1వ తేదీ నుంచి పట్టణంలో ఉచిత మజ్జిగ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దాతలు యతిరాజ్యం సాయిబాబా కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో 50 రోజులుగా మజ్జిగ పంపిణీని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కో-చైర్మన్ కొత్తపల్లి చిట్టిబాబు, వైఎస్ ప్రెసిడెంట్ కరుటూరు లక్ష్మీనారాయణ, కార్యదర్శి మొల్లేటి నారాయణమూర్తి, వెలుగుల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



ఘాట్ రోడ్డు జంక్షన్‌లో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

## యువత ఉపాధి కల్పనకు కార్యాచరణ

**కూటమి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యం**

**మినీ మహానాడులో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి**



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల

మాడుగుల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి కల్పనకు కార్యాచరణ రూపొందించామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్ చెరకు కాటా ఆవరణలో సోమవారం మినీ మహానాడు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ పరిశీలకులు ఏసుదాసు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు తో పాటు పలువురు నియోజకవర్గ స్థాయి నాయకులు కార్యక్రమానికి విచ్చేశారు. ముందుగా పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పర్యాటకులకు, పాకిస్థాన్‌తో చేసిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ జవాన్‌లకు నివాళులర్పిస్తూ జంక్షన్‌లో తిరంగా ర్యాలీ చేపట్టారు. అలాగే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వహయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర అభివృద్ధే అజెండాగా పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. అంతేకాకుండా మాడుగులలో పాలిటెక్నిక్ కళాశాల, చీడికాడలో మరో కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఏదైనా కొత్తగా ప్రాజెక్టు నిర్మిస్తే దివంగత నేత, మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ పేరు పెడతామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకటించారు. నియోజకవర్గంలో రిజర్వాయర్లు, పలు అభివృద్ధి పనులకు మహానాడు సభ ద్వారా తీర్మానం చేసి ప్రభుత్వానికి అందిస్తామన్నారు. అనంతరం పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, తదితరులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి దేముడు, నియోజకవర్గ నాయకులు కిలపర్తి భాస్కరరావు, ఎస్.రామునాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల ఆధునికీకరణకు కృషి

**మాడుగుల ఎమ్మెల్యే బండారు**



ఎంపీడీవో చాంబర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, మే 19 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలో ప్రభుత్వ భవనాల ఆధునికీకరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. చీడికాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చాంబర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గదులు విశాలంగా ఉండడంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, ఎంపీడీవో హేమసుందర రావు, ఈవోపీఆర్డీ కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బండారు తాతబాబు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు సోమవారం గ్రామానికి వచ్చి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ.కుమార్ తదితరులు వచ్చి సంతాపం తెలిపారు.

## మహిళలకు ఆర్థిక చేయూత: ఎమ్మెల్యే

మాడుగుల, మే 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కుట్టుశిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించిన ఆయన మహిళలతో మాట్లాడారు. మహిళలకే తొలి ప్రాధాన్యత ఇచ్చిన సీఎం చంద్రబాబు అన్నారు. అందుకే కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి, వాటి ద్వారా ఆసక్తి కలిగిన మహిళలకు శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణలో నైపుణ్యత సాధించి ప్రభుత్వం అందించే కుట్టుమిషన్ ద్వారా స్వయం ఉపాధి పొందాలని ఈ సందర్భంగా మహిళలకు సూచించారు. కుట్టుమిషన్లు పొందాలంటే మూడు నెలల పాటు క్రమం తప్పకుండా శిక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పి.అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.జగ్గారావు, పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, వడ్డే రాజ్‌కుమార్, కొట్టేడ మల్లికార్జునుడు, మరువాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేలో తొలగించిన పేర్లు పునరుద్ధరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గర్నికం దళితులు

రావికమతం, మే 19 (ఆంధ్రజ్యోతి): జగనన్న రీ సర్వేలో దొర్లిన తప్పులను సవరణ చేయాలని గర్నికం గ్రామ దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కుల వివక్షత వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధి గోవిందరావు మాట్లాడుతూ గర్నికం పరిధిలో 25 దళిత కుటుంబాలకు సుమారు 20 ఎకరాల డీ.పట్టా భూములను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ భూముల్లో పండ్ల తోటలు పెంపకం చేయించారని, వీటిపై కుటుంబాలు జీవనాధారం పొందుతున్నాయని చెప్పారు. సాగు అనుభవంలో ఉన్న భూములకు జగనన్న రీ సర్వే పేరుతో సిబ్బంది డీఎల్ఆర్ డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్‌లో నమోదు చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు చేవ్వేటి సూరిబాబు, ఎత్తుల కల్యాణం పాల్గొన్నారు.

## 'అన్నదాత సుఖీభవ నమోదుకు గడువు పొడిగింపు'

సబ్బవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు గడువును ప్రభుత్వం పొడిగించిందని మండల వ్యవసాయ శాఖ అధికారి పోతల సత్యనారాయణ చెప్పారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ పథకం కోసం అర్హులను గుర్తించడానికి ఆన్‌లైన్‌లో ల్యాండ్ వ్యారిఫికేషన్ కార్యక్రమం వేగంగా జరుగుతున్నదని తెలిపారు. మండలంలో 21,362 మంది రైతులకు భూమి ఖాతాలు ఉన్నాయని, ఇప్పటి వరకు 5,200 ఖాతాలకు సంబంధించి ల్యాండ్ వ్యారిఫికేషన్ పూర్తయ్యిందన్నారు. వాస్తవంగా అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు గడువు సోమవా రంతో ముగిసిందని, అయితే వెబ్‌సైట్ సర్వర్ సమస్య కారణంగా ప్రభుత్వం గడువు పెంచిందని ఏవో సత్యనారాయణ స్పష్టం చేశారు.

# గోవాడ షుగర్స్‌లో ఇథనాల్ ప్లాంట్‌కు చర్యలు

**బీఎన్ రోడ్డు అభివృద్ధి.. పారిశ్రామిక వాడగా చోడవరం**

**చోడవరం మినీ మహానాడులో తీర్మానాలు**






మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు... పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

చోడవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆధారమైన గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవడానికి ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ కేంద్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన మినీ మహానాడులో తీర్మానించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అధ్యక్షతన నిర్వహించిన మినీ మహానాడులో నియోజకవర్గంలోని ప్రధానమైన సమస్యలు ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చేసిన తీర్మానాలను ఆమోదించారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉన్నామన్నారు. నాయకులు అవినీతి పనులకు పాల్పడి పార్టీకి చెడ్డపేరు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. అత్యంత మెజారిటీ ఇచ్చిన ప్రజలకు సంపూర్ణంగా న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ జిల్లాలోని అడ్డరోడ్డులో ఈ నెల 22న నిర్వహించనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గోవాడ ఫ్యాక్టరీని ఆదుకోవాల్సిన బాధ్యత ఉన్నందున, ఫ్యాక్టరీ ఇథనాల్ ప్లాంట్‌కు సహకారం అందించాలని, బీఎన్ రోడ్డును నర్సీపట్నం వరకూ అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలని తీర్మానించారు. నియోజకవర్గంలోని కల్యాణపులోవ, పెద్దేరు రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని సూచించారు. నిరుద్యోగ యువత కోసం మండలానికో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసి, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కోర్టు భవనాల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకులు మూర్తియాదవ్ మాట్లాడారు. టీడీపీ సీనియర్ నేతలు గూనూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు మజ్జి గౌరీశంకర్, పూతి కోటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు డి.వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్జీలు పెండింగ్ లేకుండా చూడండి: ఆర్డీవో



వినతిపత్రం పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్ లేకుండా చూడాలని ఆర్డీవో వీవీ.రమణ అధికారులకు ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 31 అర్జీలు స్వీకరించారు. 2018లో తూర్పు కాపు బీసీ-డి సర్టిఫికెట్ తీసుకున్నానని, ఇప్పుడు బీసీ-డి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఓసీగా వస్తున్నదని రావికమతం మండలం కన్నంపేటకు చెందిన నాగులపల్లి బాబూరావు ఫిర్యాదు చేశారు. తన భార్యకు, ఇద్దరు పిల్లలకు బీసీ-డి కుల ధ్రువ పత్రాలు మంజూరయ్యాయని తెలిపారు. ఇటీవల పాముకాటుతో తన తల్లి చనిపోయిందని, ఆమె ఆస్తి కోసం వాళ్ల అన్నయ్య, చెల్లి తనను ఇబ్బంది పెడుతున్నారని చెర్లోపాలెంకి చెందిన అన్నంరెడ్డి కాశీరత్నంఫిర్యాదు చేశారు. ఉమ్మడి స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాకవరపాలెం మండలం శెట్టిపాలెంకి చెందిన రెడ్డి అక్కునాయుడు, రెడ్డి అయ్యలనాయుడు, రెడ్డి గంగాధర్ ఫిర్యాదు చేశారు. రామారావుపేటలోని ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల కారణంగా ఆటోలు, బస్సులు, రిక్షాలతో రద్దీగా ఉంటుందని, పిల్లలను దింపిన తర్వాత స్కూల్ బస్సులు రోడ్డులో పార్కింగ్ చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడు తున్నదని, దీనిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త శివనారాయణరాజు ఫిర్యాదు చేశారు.

# ప్రశాంతంగా చోడవరం కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక

**▸▸ కో ఆప్షన్ సభ్యుడిగా షేక్ అల్లాజీ**



కోఆప్షన్ సభ్యుడు అల్లాజీతో ప్రమాణం చేయిస్తున్న ఎన్నికల అధికారి రాజేశ్వరి

చోడవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యునిగా షేక్ అల్లాజీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్‌లో కో ఆప్షన్ సభ్యునిగా ఉన్న షేక్ రహిమాన్ మృతి చెందడంతో, ఆ స్థానానికి సోమవారం ఎన్నికల అధికారి కె.రాజేశ్వరి ఎన్నిక నిర్వహించారు. మృతి చెందిన రహిమాన్ స్థానంలో ఆయన కుమారుడు షేక్ అల్లాజీ ఒక్కడే నామినేషన్ దాఖలు చేయడంతో అల్లాజీ ఎన్నిక ఏకగ్రీవమైంది. వైసీపీ సభ్యులు ఎన్నికకు హాజరుకాగా, టీడీపీ సభ్యులు మానవతాదృక్పథంతో పోటీకి దూరంగా ఉండడంతో అల్లాజీ ఎన్నిక ఏకగ్రీవమైంది. కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన అల్లాజీతో ప్రత్యేక అధికారి ప్రమాణం చేయించారు. ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీలైన ఈశ్వరరావు, నాయకులు ఏడువాక సత్యారావు, పల్లేటి వెంకటేశ్, గూనూరు రాజు, నాగేశ్వరరావు, ఇతర ఎంపీటీసీ సభ్యులు, నాయకులు అభినందించడంతో పాటు ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు శ్రీనాధు శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీను, నాయకులు వీర్ని సురేశ్, ఖాతా వెంకటరమణ, నూతుగట్టు నాగశంకర్, బొడ్డేటి గంగాధర్, కొట్యాడ భాస్కర్ అభినందించారు.

## మాడుగుల వైస్ ఎంపీపీగా విజయలక్ష్మి



పొలిమేర విజయలక్ష్మి

మాడుగుల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం ఉపాధ్యక్షురాలుగా మాడుగుల ఒకటో సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు పొలిమేర విజయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. మండల ప్రత్యేకాధికారి కె.వీరంనాయుడు, ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ ఎన్నిక నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా పొలిమేర విజయలక్ష్మిని ప్రస్తుత ఎంపీపీ తాళ్లపురెడ్డి వి.రాజారాం బలపరచగా, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ ఆమోదించారు. దీంతో మిగిలిన ఎంపీటీసీ సభ్యులు కూడా చేతులు ఎత్తి విజయలక్ష్మిని ఉపాధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో విజయలక్ష్మిని మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో పాటు జిల్లా

## దేవరాపల్లి వైస్ ఎంపీపీగా సింహాచలంనాయుడు



సింహాచలంనాయుడు

దేవరాపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ వైస్ ఎంపీపీ-1గా మామిడిపల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచాడ సింహాచలంనాయుడును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు, ఏవో లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో జరిగింది. వైస్ ఎంపీపీగా ఉన్న చింతల బుల్లిలక్ష్మి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టడంతో వైస్ ఎంపీపీ-1గా సింహాచలంనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో 17 ఎంపీటీసీ సభ్యుల్లో 12 మంది హాజరయ్యారు. ఎన్నికైన సింహాచలంనాయుడును అధికారులు, ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జడ్పీటీసీ కర్రి సత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అభినందించారు.

## గుమ్మిడిగొండ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

నాతవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): నాతవరం-గుమ్మిడిగొండ ఆర్అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణానికి కోటి 40 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రయాణికులు, గుమ్మిడిగొండ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుమ్మిడిగొండ తాండవ వంతెన నుంచి తాగునీటి ట్యాంక్ వరకు 300 మీటర్లు సీసీ రోడ్డుకు రెండు కల్వర్టులకు రూ.40 లక్షల ప్లాన్ నిధులు మంజూరైనట్టు అధికారులు చెప్తున్నారు. అలాగే మండలకేంద్రం నాతవరం నుంచి గోమ్మిడిగొండ వరకు నాబార్డు నిధులు మరో రూ.90 లక్షలు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ జేఈ కె.నారాయణరెడ్డి తెలిపారు. టెండరు పూర్తి అయిన వెంటనే గుమ్మిడిగొండ రోడ్డు పనులు మొదలు పెడతారని తెలిపారు. గుమ్మిడిగొండ రోడ్డు పెద్దపెద్ద గోతులతో ఉండడంతో వర్షాకాలంలో చాల అవస్థలు పడేవారమని మంజూరైన నిధులతో రోడ్డు పనులు పూర్తయితే తమ కష్టాలు గటెక్కుతాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

## టెన్త్ ఫలితాల్లో ప్రతిభావంతులకు సత్కారం

చోడవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. శ్రీకృష్ణ దేవరాయ తూర్పుకాపు యువ జన సంక్షేమ సంఘం, కేఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పది ఫలితాల్లో 500 మార్కులు దాటిన విద్యార్థినీ, విద్యార్థులందరినీ సత్కరించడంతో పాటు జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులనుసన్మానిస్తున్న దృశ్యం

## పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి



సుందరయ్యకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

నర్సీపట్నం/బుచ్చెయ్యపేట/దేవరాపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం తొలి అఖిల భారత ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నర్సీపట్నం, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి మండలాలల్లో సుందరయ్య 40వ వర్ధంతి ఎక్కువగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ భూస్వాముల కుటుంబంలో పుట్టిన సుందరయ్య తన యావదాస్తిని పేదల కోసం, పార్టీ కోసం ఖర్చు చేశారని తెలిపారు. సీపీఎం తొలి ప్రధాన కార్యదర్శిగా పనిచేయడం గర్వకారణమన్నారు. సుందరయ్య బాటలో అందరు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అడిగర్ల రాజు, ఐద్వా నాయకురాలు ఎల్ గౌరి, కె.రామకృష్ణ, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు. అలాగే బుచ్చెయ్యపేట మండలంలోని బంగారుమెట్ట గ్రామంలో దివంగత నేత, సీపీఎం నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఉపాధి శ్రామికుల సమక్షంలో నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్లమెంట్‌కు కూడా సైకిల్‌పై వెళ్లి అనేక ప్రజా సమస్యలను పరిష్కరించారన్నారు. భూస్వామ్య ధనిక వర్గంలో జన్మించినప్పటికీ నిరాడంబరంగా ప్రజల కోసమే జీవించారన్నారు. పుచ్చలపల్లి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సోషలిస్ట్ సమాజం రావాలని సీఐటీయూ మండల కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు తెలిపారు.



బుచ్చెయ్యపేటలో నినాదాలు చేస్తున్న కూలీలు

అలాగే దేవరాపల్లి మండలంలోని వాలాబు శివారు కోడాపల్లి, రామన్నపాలెం గ్రామాల్లో సుందరయ్య వర్ధంతి సోమవారం నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకుడు లక్ష్మణ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 సంవత్సరాల బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాట ఫలితం మనం స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నామని చెప్పారు.

## పకడ్బంధీగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

**తెలుగు పరీక్షలకు 47 మంది గైర్హాజరు**

**ఫీజు కట్టకపోయినా అందరికీ హాల్ టిక్కెట్లు**

నర్సీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బంధీగా ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 116 మంది హాజరుకావాల్సి ఉండగా 69 మంది మాత్రమే రాశారు. 47 మంది గైర్హాజరయ్యారు. ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం సప్లిమెంటరీ పరీక్ష ఫీజు కట్టకపోయినా పరీక్ష రాయడానికి అవకాశం కల్పించింది. మార్చిలో జరిగిన 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లు మంజూరు చేసినట్టు ఎంఈవో తలుపులు తెలిపారు. పరీక్ష ఫీజు కట్టని విద్యార్థులు కూడా హాల్ టిక్కెట్టు తీసుకొని పరీక్ష రాయవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు నర్సీపట్నంలో మినీ మహానాడు

నర్సీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రంలో మంగళవారం టీడీపీ మినీ మహానాడు జరగనుంది. ఇందుకోసం నర్సీపట్నం-కోటవురట్ల రహదారిలోని స్టార్ హోమ్స్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

## అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

చోడవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు మూడు సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, నాయకులు పైడిబాబు, అప్పన్న, శ్రీను, ఈశ్వరరావు, మల్లయ్య, తాతారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవలో పెట్టుబడి సాయం

దేవరాపల్లి, మే19 (ఆంధ్రజ్యోతి) అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు పెట్టుబడి సహాయం అందిస్తున్నామని వ్యవసాయాధికారి ఎల్.వై.కాంతమ్మ చెప్పారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రంలో విధిగా పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఉన్న పేర్లు చూసుకోవాలన్నారు. నెలాఖరులోగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

చీడికాడ, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగుతో తక్కువ ఖర్చుతో రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందని సీడీసీ ఛైర్మన్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం ఖండివరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఉత్తమ రైతులుగా ఉన్న గుల్లిపల్లి వరహామూర్తి, సుంకరి వెంకటలక్ష్మి, తంగేటి నారాయణమ్మ, డోకల అప్పలనాయుడు తదితరులు సాగులో అనుభవాలను మిగిలిన రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంగీతరెడ్డి, సత్యనారాయణ, పి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ

మాకవరపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిపాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులు, ప్రజా ప్రతినిధులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి చిరంజీవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు చేకూర్చుతుందని చెప్పారు. ప్రతీ రైతు తన పొలంలో ఎంతో కొంత భూమిని సాగు చేసుకోవాలని సూచించారు. పొలాల్లో చల్లేందుకు 30 రకాల దినుసులతో ఉన్న విత్తనాల కిట్‌ను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రుత్తల సత్యవతి, టీడీపీ నాయకులు సిద్దాబత్తుల శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

నర్సీపట్నం అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఓఎల్‌పురంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ మాట్లాడుతూ బగుడు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి అందరికీ సమాన హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో ఏఐఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జి.ఆదిలక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య, జనసేన పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేశ్ పాల్గొన్నారు.

## పింఛన్లు తొలగించారని ఫిర్యాదు

గొలుగొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): నోటీసులు అందించకుండానే తమ పింఛన్లు తొలగించారని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులు ఈవోపీఆర్డీ శ్రీనివాసరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. అర్హతలు ఉన్నప్పటికీ తమ పింఛన్లు తొలగించడం అన్యాయమని వారు వాపోయారు. అధికారులు పరిశీలించి పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాకలపాడు నాయకులు పాల్గొన్నారు.

## జీసీసీ డీఎంగా బుక్కా వెంకటేశ్



డీఎం వెంకటేశ్‌ని స్వాగతం పలుకుతున్న జీసీసీ ఉద్యోగులు

చింతపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సహకార సంస్థ డివిజన్ మేనేజర్‌గా బుక్కా వెంకటేశ్ నియమితులయ్యారు. తాజా పదోన్నతుల్లో పాడేరు బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ని మేనేజర్‌గా పదోన్నతి కల్పిస్తూ చింతపల్లి డివిజనల్ మేనేజర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు సోమవారం ఆయన డీఎంగా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా విధుల్లో చేరిన వెంకటేశ్‌ని డివిజనల్ కార్యాలయం, బ్రాంచి కార్యాలయం పరిధి జీసీసీ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆదివాసీలకు జీసీసీ సేవలు అందించడంతోపాటు సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాగా చింతపల్లి డివిజనల్ మేనేజర్ పి. దేవరాజుని చింతూరు డివిజన్‌కి బదిలీ చేశారు. కార్యక్రమంలో సరమండ విజయక్‌కుమార్, గసాడి మల్లేశ్వరరావు, లండ రమణమూర్తి, రామకృష్ణ, బీపీ రాజు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎంఈవో బాబురావు పడాల్

జి.మాడుగుల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పదో తరగతిలో ఫెయిల్ అయిన ఆశ్రమ విద్యార్థులు గురుకుల పాఠశాల, కొత్తూరు బాలురు-1 , గాంధీనగర్ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో పరీక్షలు రాశారు. ఈ కేంద్రాల్లో 84 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 73 మంది హాజరయ్యారని ఎంఈవో బాబురావు పడాల్ చెప్పారు.

## సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

పాడేరురూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్ ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రజలు, కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సుందరయ్య 40 వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య జీవితం ఎందరికో ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు, వి.దాస్, జీవన్, చిన్నారావు, కార్తీక్ పాల్గొన్నారు.

## ఆర్వీనగర్ రోడ్డు పనులు ప్రారంభించాలి

- మినీ మహానాడులో కూటమి నేతలు వినతి



గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న సీలేరు కూటమి నేతలు

సీలేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు గల అంతర్రాష్ట్ర రహదారి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీలేరు కూటమి నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం పాడేరులో జరిగిన మినీ మహానాడులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి వినతిపత్రాన్ని అరకు పార్లమెంటరీ అబ్జర్వర్ హర్షవర్ధన్ సమక్షంలో అందజేశారు. కడపలో జరిగే మహానాడులో రహదారి సమస్యపై వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇవ్వాలని వారు కోరారు. రహదారి సమస్యపై ఈ ప్రాంత ప్రయాణికులు, అత్యవసర రోగులు పడుతున్న కష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏసీ చిటికెల రాము, అధ్యక్షుడు ఎస్‌కేనాగూర్ మీరా, ఉపాధ్యక్షుడు కొప్పోజు కాశీ, కార్యదర్శి బండారు మారిబాబు, జీపీ లోన్ కార్యదర్శి నాయుడు, అడపా రాము, కిల్లో కార్తీక్, జనసేన నాయకులు వనముల రాము, మెండి రమణ, బీజేపీకి చెందిన కొర్ర భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్‌పై తీర్మానం చేయండి: బాలదేవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పొద్దు బాలదేవ్ బృందం

అరకులోయ, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో గిరిజన ప్రాంతంలోఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానం చేయాలని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం అరకులోయ గిరిజన్ భవన్‌లో కమిటీ కో-కన్వీనర్లు పొద్దు బాలదేవ్, చట్టు మోహన్ బృందం విలేకర్లతో మాట్లాడారు. మోగా డీఎస్సీలో ఆదివాసీ ప్రాంతంలో నోటిపై చేసిన 4680 ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ ప్రకటించి శతశాతం ఆదివాసీ అభ్యర్థులతోనే పోస్టులు భర్తీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో చర్చించి ప్రకటన చేయాలని వారు కోరారు. క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆదివాసీలకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటారని కొండంత ఆశతో ఉన్నామని ఆదివాసీ డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు బాలదేవ్, చట్టు మెహన్, జాన్‌బాబు, పాంగి అశోక్, కిల్లో జగన్నాథం తదితరులు పేర్కొన్నారు.

# ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

- పార్టీ పరిశీలకులు హర్షవర్ధన్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి
- విజయవంతంగా పాడేరు మినీ మహానాడు



సభలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈశ్వరి

పాడేరురూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిత్యం తపించే ఏకైన పార్టీ తెలుగుదేశం అని అరకు పార్లమెంట్ పరిశీలకులు హర్షవర్ధన్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు కాఫీహౌస్‌లో నిర్వహించిన పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ మహానాడులో వారు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రజలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని విజయం అందించారన్నారు. అందుకే ఈసారి మినీ మహానాడు, ఎన్టీఆర్ జయంతి వేడుకలను పండగ వాతావరణలో ఘనంగా నిర్వహించారన్నారు. ప్రజలు ఛీత్కరించినా జగన్మోహన్‌రెడ్డికి, ఆయన అనుచరగణంలో ఏమాత్రం మార్పు రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికీ ప్రజలను మభ్యపెట్టేందుకు తన సొంత మీడియా ద్వారా అసత్యాలు ప్రచారం చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, ఎం.ప్రసాద్, చల్లంగి లక్ష్మణరావు, బొర్రా విజయరాణి, డప్పోడి వెంకటరమణ, ఎస్.రత్నకుమారి, జి.శివకుమార్, రొబ్బి రాము, రమణమూర్తి, నాగబ్బాయి, డిప్పల వెంకటకుమారి, ఎ.సుబ్బలక్ష్మి, పూర్ణచందరరావు, ఎం.రమేష్, వి.కొండలరావు, నాగమణి, ఉషారాణి, ఎల్.పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# సీలేరు నుంచి ధారకొండ సబ్ స్టేషన్‌కు కొత్త విద్యుత్ లైన్

- తీరనున్న ఐదు పంచాయతీల విద్యుత్ సమస్య
- కొత్త లైన్‌కు ఈపీడీసీఎల్ సిబ్బంది డీజీబీఎస్ సర్వే
- విద్యుత్ లైన్ పనులకు రూ. 4 కోట్లు మంజూరు



ఈపీడీఈఎల్ అధికార్లు, సిబ్బంది డీజీబీఎస్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

సీలేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవులు, గాలికొండ, అమ్మవారి ధారకొండ పంచాయతీలకు సీలేరు జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా చేయాలన్న ఈ ప్రాంత గిరిజనుల రెండు దశాబ్దాల కల తీరనుంది. ఇందుకోసం పలు పర్యాయాలు గిరిజనులు ఆందోళనలు చేశారు. ఈ ఐదు పంచాయతీల ప్రజలు నిత్యం విద్యుత్ సరఫరా లేక తీవ్రంగా ఇబ్బంది పడేవారు. కొన్ని సందర్భాల్లో వారాల తరబడి చీకట్లో గడిపేవారు. ఈ ఐదు పంచాయతీలకు ధారకొండ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా అవుతోంది. ధారకొండ సబ్ స్టేషన్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సీపట్నం సబ్ స్టేషన్ నుంచి దట్టమైన అటవీ మార్గంలో విద్యుత్ సరఫరా జరుగుతోంది. దట్టమైన అటవీ మార్గంలో విద్యుత్ లైన్లు ఉండడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో సీలేరు జల విద్యుత్ కేంద్రం నుంచి తమకు విద్యుత్ సరఫరా చేయాలని ఈ ఐదు పంచాయతీల గిరిజనులు రెండు దశాబ్దాల నుంచి ఆందోళనలు చేశారు. ఈ విషయం ఈపీడీసీఎల్ సీఎండీ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ధారకొండ సబ్ స్టేషన్‌కు సీలేరు నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటుకు సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఈపీడీసీఎల్ ఏడీఈ సన్నిరాంబాబు ఆధ్వర్యంలో డీజీబీఎస్ సర్వే పనులను శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఈపీడీసీఎల్ ఏడీఈ సన్నిరాంబాబు వద్ద వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా సీలేరు జలవిద్యుత్ కేంద్రం నుంచి ధారకొండ 33 కేవీ సబ్ స్టేషన్‌కు కొత్త లైన్ ఏర్పాటుకు సీఎండీ నుంచి ఆదేశాలు అందాయన్నారు. కొత్త లైన్‌ను రిజర్వు ఫారెస్టు నుంచి వేసేందుకు డీజీబీఎస్ సర్వేను నిర్వహించాలని అటవీ శాఖ తెలపడంతో సర్వే ప్రారంభించామన్నారు. సర్వే పూర్తయిన తర్వాత అటవీ శాఖకు నివేదికను అందజేస్తామన్నారు. ఆ నివేదికను పరిశీలించిన అటవీ శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేస్తారన్నారు. అనంతరం కొత్త విద్యుత్ లైన్ వేస్తామన్నారు. కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటుకు రూ.నాలుగు కోట్లు మంజూరయ్యాయన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఏఎస్పీ మిశ్రా



జీకేవీధి కాలనీ వద్ద ఏర్పడిన గొయ్యిని పరిశీలిస్తున్న ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

చింతపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నారు. సోమవారం ఏఎస్పీ హైవే ఇంజనీరింగ్, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ప్రత్యేక క్యాంపెయన్ నిర్వహిస్తున్నామన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఆర్టీసీ, ప్రైవేటు సర్వీసు, ద్విచక్రవాహనాలు పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడిపితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారి మలుపుల వద్ద కచ్చితంగా హెచ్చరిక బోర్డులు, సోలారు బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని హైవే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వినోద్ బాబు, ఎన్‌హెచ్ ఏఈఈ తిలక్ పాల్గొన్నారు.

### అంతర్ రాష్ట్ర రహదారికి తాత్కాలిక మరమ్మతులు

గూడెంకొత్తవీధి, మే 19 (ఆంధ్రజ్యోతి):సీలేరు-చింతపల్లి అంతర్ రాష్ట్ర రహదారిలో ప్రమాదాలను నియంత్రించేందుకు ఆర్వీనగర్ నుంచి లంకపాకల వరకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నట్లు చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తెలిపారు. సోమవారం జీకేవీధి మండల కేంద్రం కాలనీ వద్ద నీళ్లతో నిండి ఉన్న వున్న గొయ్యిని పరిశీలించారు. ఎక్స్‌కవేటర్‌తో మట్టి వేసి పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఆర్వీనగర్ నుంచి లంకపాకలు వరకు రహదారి అధ్వానంగా తయారైందన్నారు. ఈ రహదారిలోని గోతులను పోలీసు శాఖ పూడ్చి వేయిస్తుందన్నారు. ఎనిమిది కిలోమీటర్ల మేరకు తాత్కాలిక మరమ్మతులు చేపడతామని ఏఎస్పీ మిశ్రా తెలిపారు. కార్యక్రమంలో సీఐ వరప్రసాద్, ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

# పెదబయలు మార్గంలో భయం భయం

### లుంగాపుట్టు వద్ద వాహన చోదకులను భయపెడుతున్న చెట్టు మోడు



ప్రధాన రహదారిపై లుంగాపుట్టు సమీపంలో చెట్టు మోడు ఒరిగిపోయిన దృశ్యం

ముంచంగిపుట్టు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన రహదారిలోని లుంగాపుట్టు సమీపంలో భారీ చెట్టు మోడు వాహన చోదకులను భయపెడుతున్నది. ఏ క్షణంలో ఈ మోడు నేలకొరుగుతుందోనన్న భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ అటుగా వాహన రాకపోకలు సాగిస్తున్నారు.

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు ప్రజలు రకాపోకలు సాగించేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ మార్గంలో ఇరు రాష్ట్రాలకు చెందిన వాహనాలు రాత్రీ పగలు తేడా లేకుండా అధిక సంఖ్యలో తిరుగుతాయి. అయితే రహదారి పక్కన భారీ చెట్టు మోడు గత కొన్నేళ్లుగా ప్రమాదబరితంగా ఉన్నప్పటికీ ఆర్‌యండ్‌బీ అధికారులు తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ మోడు పటుత్వం కోల్పోయింది. ఏ క్షణమైనా నేలకొరిగే అవకాశం కనిపిస్తుంది. మోడు కింది భాగం నుంచి వచ్చిన చిన్నపాటి చిగురుల ఆధారంతో ఉంది. గత కొద్ది రోజులుగా భారీ ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో రోజు వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల చెట్టు కొమ్మలు విరిగిపడుతున్న విషయం తెలిసిందే. పెను ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి ఎండిపోయిన చెట్టు మోడును తొలగించే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే పెదబయలు నుంచి మండల కేంద్రం మీదుగా జోలాపుట్టు, సంగడ, కుమడ వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో పలు చోట్ల రహదారి పక్కన చెట్లు పటుత్వం కోల్పోయి ప్రమాదబరితంగా మారాయి. వాటిని సైతం సంబంధిత అధికారులు గుర్తించి తొలగించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

## గిరి గ్రామాల్లో కానరాని డ్రైనేజీ వ్యవస్థ

- ఎక్కడికక్కడే పేరుకుపోతున్న మురుగు నీటి నిల్వలు
- పారిశుధ్య లోపంతో వ్యాధుల వ్యాప్తి

ముంచంగిపుట్టు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మారుమూల రంగబయలు, బుంగాపుట్టు, లక్ష్మీపురం, బరడ, బంగారుమెట్ట, కుమడ, బూసిపుట్టు, పెదగూడ, సంగడ, దోడీపుట్టు, బాబుసాల తదితర పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో డ్రైనేజీ సదుపాయం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇళ్లకు ఇరువైపులా, వీధుల్లో మురుగు నీరు ప్రవహించడంతో పాటు ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోతోంది. ఫలితంగా గిరిగ్రామాల్లో ప్రజలు వివిధ వ్యాధుల బారి నపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. వర్షపు నీ రు ఉధృతికి కొట్టుకువచ్చిన చెత్త గ్రామాల్లో పేరుకుపోతోంది. దీంతో వ్యాధుల వ్యాప్తికి ఆజ్యంపోసినట్టుగా మారుతుందని గిరిజనులు వాపోతున్నారు. వీధుల్లో డ్రైనేజీ సదుపాయంలేక ఈ దుస్థితి నెలకొంటోంది. సీసీ రోడ్లు నిర్మించాలని, వాటి ఇరువైపులా డ్రైనేజీ సదుపాయం కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు వినతిలిచ్చినా ఫలితం కానరావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దిమిడి గ్రామంలో ఇళ్ల మధ్యలో మురుగు నీరు (ఫైల్‌ఫొటో)

## జాతీయ భద్రతలో భాగస్వాములు కావాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి
- వీర జవాన్లకు ఘన నివాళులు




తిరంగా ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అనంతగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతలోని ప్రజలంతా భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీజేపీ, జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం వీర జవాన్లకు ఘన నివాళులర్పించి, ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తీరంగా యాత్ర ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రక్షణలోని వీర జవాన్ల పాత్ర గొప్పదని కొనియాడారు. ఏ సమయంలోనైనా ప్రాణాలకు తెగించి, పోరాటం చేస్తున్న ఇండియాన్ ఆర్మీకి సెల్యూట్ చేశారు. దేశ రక్షణలో ప్రాణాలను అర్పించిన జవాన్లను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర కార్యదర్శి వీ.రామచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు శరభ ఏమన్నబాబు, అసెంబ్లీ కన్వీనర్ శెట్టి రాజు, మండల అధ్యక్షుడు సోమరాజు, ఆనంద్, అప్పలస్వామి, జనసేన అధ్యక్షుడు చిట్టం మురళి, రత్నప్రియ, పి.జగన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## పాడేరులో సీహెచ్‌వోల ఆందోళన




పాడేరులో ర్యాలీని చేపట్టిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు

పాడేరురూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమవారం ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ దుర్గాభవాని, వైస్‌ప్రెసిడెంట్ వాసు మాట్లాడుతూ రెండేళ్లుగా పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం విచారకమన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోవడంతో 22 రోజులుగా సమ్మె చేస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పవణ్ కళ్యాణ్, రాము, గణేష్, లావణ్యతోపాటు 234 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

### తగ్గని ఎండల తీవ్రత

పాడేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మన్యంలో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎండల తీవ్రత మాత్రం తగ్గడం లేదు. దీంతో ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు కానరావడం లేదు. కొయ్యూరులో సోమవారం 35.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా జీకేవీధిలో 33.5, పెదబయలులో 32.9, డుంబ్రిగుడలో 31.1, చింతపల్లిలో 31.0, జి.మాడుగులలో 29.9, అరకులోయలో 29.4, అనంతగిరిలో 29.0, హుకుంపేటలో 26.1, పాడేరులో 25.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

కొయ్యూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు సంక్షేమ పథకాల అమలుకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు రైతు సేవ కేంద్రాల ద్వారా చర్యలు చేపట్టినట్టు మండల వ్యవసాయ శాఖాధికారిణి ఉమాదేవి తెలిపారు. ఈ మేరకు ప్రతి రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఇందులో భాగంగా కౌలు రైతులను గుర్తించిన అనంతరం వారు కౌలుకు తీసుకున్న భూమి యజమాని వివరాలు పరిశీలించి కౌలురైతుగా ఆమోదించడం జరుగుతుందన్నారు. అనంతరం తహసీల్దారు కౌలురైతుకు గుర్తింపు కార్డు ఇస్తారన్నారు. ప్రతీ సంవత్సరం తొలకరిలో కార్డు జారీ చేస్తారని, వీటి కాల పరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని ఏవో సూచించారు.

### జి.మాడుగులలో దోమల బెడద



జి.మాడుగులలో డ్రైనేజీలో నిలిచిన మురుగు నీరు

జి.మాడుగుల, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇటీవల దోమల బెడద తీవ్రమైంది. హైవే పనులు చేపడుతుండడంతో వాటి వ్యర్థాలు డ్రైనేజీల్లో పడిపోతుండడంతో వర్షపు నీరు నిలిచి దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో కంటి మీద కునుకు లేకుండా పోతున్నదని మండల కేంద్రం వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని వారంటున్నారు. ఎపిడమిక్ సీజన్ కావడంతో మలేరియా సోకే ప్రమాదం ఉందని వారు దిగులు చెందుతున్నారు. సంబంధిత అధికారులు దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని మండల కేంద్రం వాసులు కోరుతున్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికే 'మీ కోసం'

డుంబ్రిగుడ, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడానికే మీ కోసం కార్యక్రమాన్ని ప్రతీ సోమవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం మీకోసం నిర్వహిస్తున్నమన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా ఈ కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు అందించాలని, త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, వివిధ శాఖల అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

### ఎస్ఐగా సూర్యనారాయణ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యనారాయణ

హుకుంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట ఎస్ఐగా ఎ.సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాదేవిపేటలో పనిచేసి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సురేశ్ పాడేరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విలేరులతో ఎస్ఐ సూర్యనారాయణ మాట్లాడుతూ మండల ప్రజలతో మమేకమై పనిచేస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తమకు తెలియజేయాలని ఆయన సూచించారు. అలాగే విధి నిర్వహణలో మండల నాయకులు, ప్రజలు తనకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

### సీహెచ్‌సీలో ఖాళీలు భర్తీచేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి త్రినాథ్

ముంచంగిపుట్టు, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నేత కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీలో వివిధ విభాగాలకు సంబంధించి సుమారు పది మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, కేవలం ముగ్గురు వైద్యులను మాత్రమే పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో 23 పంచాయతీల ప్రజలు ఆధారపడి ఉన్న సీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బంది కొరత కారణంగా వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారని వాపోయారు. అలాగే ఉన్న అరకొర వైద్యులు, వైద్య సిబ్బందిపై పని భారం పడుతుందని, రోజుకు 100 నుంచి, 200 మందికి వైద్య సేవలు అందించడం వారికి తలకు మించిన భారంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గైనకాలజిస్ట్ లేకపోవడం వలన వివిధ ఆరోగ్య సమస్యలతో సీహెచ్‌సీకి వచ్చే మహిళలు, గర్భిణీలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, గర్భిణీలకు సంబంధించి నెలవారి జరగాల్సిన ఆరోగ్య పరీక్షలు, స్కానింగ్‌లు సక్రమంగా జరగడంలేదని అన్నారు. దాని కారణంగా మాతాశిశు మరణాలు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాలని , సీహెచ్‌సీకి వచ్చే రోగులకు సంపూర్ణ వైద్య సేవలు అందే విధంగా చూడాలని కోరారు.

## టీడీపీ అనకాపల్లి మండల అధ్యక్షుడిగా బాబీ

▸ అధికారికంగా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే 'పీలా'


వెంకట సన్యాసినాయుడు (బాబీ)

తుమ్మపాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అనకాపల్లి మండల అధ్యక్షుడిగా తుమ్మపాల గ్రామానికి చెందిన కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబీ) నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అధికారికంగా ప్రకటించారు. బాబి టీడీపీలో పలు పదవులను చేపట్టి ప్రజలకు సేవలందిం చారు. తుమ్మపాల సర్పంచ్‌గా ఐదేళ్లపాటు పనిచేశారు. అన్నపూర్ణ బ్యాంక్ (పీఏసీఎస్) చైర్మన్‌గా గ్రామీణ ప్రాంత రైతులకు విశేష సేవలందించారు. రైల్వే బోర్డు మెంబర్‌గా, టెలికం బోర్డు మెంబర్‌గా పదవులను చేపట్టి పలువురి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాకుండా గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. బాబీ ఈ పదవికి ఎంపిక కావడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## నూకాంబిక సేవలో అన్నవరం దేవస్థానం ఈవో


నూకాంబికను దర్శించుకుంటున్న అన్నవరం దేవస్థానం ఈవో దంపతులు

అనకాపల్లి టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నూకాంబిక అమ్మవారిని సోమవారం అన్నవరం దేవస్థానం ఈవో వి.సుబ్బారావు దంపతులు, అన్నవరం దేవస్థానం అర్చకులు సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరికి ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, సహాయ కమిషనర్, ఆలయ ఈవో వెంపలి రాంబాబు అందజేశారు.

## వెంకన్న ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పరవాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో కొండపై కొలువుదీరిన అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా గోదా, మహాలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలుత ఆలయ ప్రధానార్చకులు హరి కృష్ణామాచార్యులు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## 'ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికులను వేధించడం తగదు'



సింహాద్రి మెయిన్ గేటు ఎదుట ఆందోళన చేపడుతున్న కార్మికులు

పరవాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కార్మికులను పోలీస్ వెరిఫికేషన్ పేరుతో వేధించడం తగదని పేర్కొంటూ సోమవారం ప్లాంట్ మెయిన్‌గేటు ఎదుట పలువురు కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను పోలీసుల నుంచి క్యారెక్టర్ సర్టిఫికేట్ తీసుకురావాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికే వైద్య పరీక్షల పేరుతో కార్మికులను వేధిస్తున్న యాజమాన్యం, క్యారెక్టర్ సర్టిఫికెట్ తీసుకురావాలని నిబంధనలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులకు ఇప్పుడు పోలీసుల నుంచి క్యారెక్టర్ సర్టిఫికెట్ తీసుకురావాలని అడగడం దారుణమన్నారు. వెంటనే ఈ నిబంధనలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు పీపీ నాయుడు, గోవిందరాజు, రమణ, శ్రీను, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వర్తక సంఘం, అనుబంధ సంస్థలకు ఎన్నికలు

అనకాపల్లి టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వర్తక సంఘం, అనుబంధ సంస్థల ఎన్నికలు సోమవారం జరిగాయి. వర్తక సంఘం అధ్యక్షులుగా తమ్మన రఘుబాబు, గౌరవ కార్యదర్శిగా కొణతాల లక్ష్మీనారాయణరావు, జాయింట్ వైస్ ప్రెసిడెంట్‌గా దాడి శ్రీనివాసరావు, కోశాధికారిగా కోరుకొండ శరత్‌కుమార్ ఎన్నికయ్యారు. అలాగే, వర్తక సంఘం అనుబంధ సంఘాలైన ప్రసూతి ఆస్పత్రి అధ్యక్షునిగా బొడ్డేడ చినరాము, కార్యదర్శిగా ఎస్వీ రంగారావు, కోశాధికారిగా వుప్పల రవిరాం జవహర్, ఏఎంఏఎల్ కళాశాల కరస్పాండెంట్‌గా పెంటకోట శ్రీను, అధ్యక్షులుగా శ్రీధరాల పేర్రాజు, ఏఎంఏఎల్ హైస్కూల్‌కు కరస్పాండెంట్‌గా కొణతాల శివకుమార్, అధ్యక్షునిగా గ్రంధి సత్యసురేష్ ఎన్నికయ్యారు. అప్పర్ ప్రైమరీ స్కూల్ అధ్యక్ష, కార్యదర్శులుగా మళ్ల సాగర్, బుద్ధ సంతోష్, కోశాధికారిగా చెలమయ్య, పాలిటెక్నిక్ కళాశాల అధ్యక్షునిగా కాండ్రేగుల శ్రీనివాసరావు, కరస్పాండెంట్‌గా కొణతాల బాల సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా కడిమిశెట్టి శ్రీను ఎన్నికైనట్టు వర్తక సంఘం గౌరవ కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణరావు తెలిపారు.

## 'దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణారావు

లంకెలపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు సూచించారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జీవీఎంసీ పార్కులో స్థానికులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా రహదారి భద్రత నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. పార్కులో అకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే 112 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొందరు అధికారుల తీరుతో ప్రభుత్వానికి మచ్చ

▸ గత వైసీపీ హయాంలో అరాచకాలకు పాల్పడినవారు ఇప్పటికీ అనకాపల్లిలోనే ఉన్నారు
▸ మినీ మహానాడులో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆగ్రహం
▸ కోడూరు, విస్సన్నపేట తదితర ప్రాంతాల్లోని భూములపై విచారణ : మాజీ ఎమ్మెల్యే పీలా
▸ 84వ వార్డు కమిటీ ఎన్నిక సమస్య రెండు రోజుల్లో పరిష్కారం : బత్తుల
▸ జిల్లా అభివృద్ధి, పార్టీ శ్రేణుల సమస్యలను ప్రస్తావించిన బుద్ధ నాగ జగదీశ్, తదితరులు


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దాడి, చిత్రంలో బత్తుల, పీలా, బుద్ధ తదితరులు


మినీ మహానాడు సభకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అనకాపల్లి టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో చీఫ్ సెక్రటరీగా పనిచేసిన జవహర్‌రెడ్డి కుమారుడు అనకాపల్లి నియోజకవర్గంలోని అనకాపల్లి, కశింకోట రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఆర్డీవో, కలెక్టరేట్‌లలో అధికారులతో పనులు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని నూకాంబిక ఆలయం సమీపం ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి మినీ మహానాడు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీరభద్రరావు తొలుత పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అరాచకాలకు పాల్పడినవారు ఇప్పటికీ అనకాపల్లిలోనే విధులు నిర్వహించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ కబ్జాలు, భూ కుంభకోణాలకు గత ప్రభుత్వంలో పాల్పడిన అధికారులను విచారణ అధికారులుగా నియమించడం బాధాకరమన్నారు. గతంలో జరిగిన భూ కుంభకోణాలపై ఫిర్యాదు చేస్తే సీఐడీ అధికారులు ఫిర్యాదు చేసిన వారిని విచారించకుండా తూ.తూ. మంత్రంగా విచారణ చేస్తున్నారని దుయ్యబట్టారు. కోడూరు భూముల కుంభకోణంలో అధికారుల స్కామ్ ఉందని కూటమి నాయకులు కాదన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలని, అక్కడి 40ఎకరాల స్థలంలో ఎంపీ సీఎం రమేశ్‌తో సంప్రదించి క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. అలాగే కోడూరు భూ వ్యవహారంపై విచారణ జరిపించాలని తీర్మానం చేయించారు. సభాధ్యక్షుడు పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ కోడూరు, విస్సన్నపేట తదితర ప్రాంతాల్లోని భూములపై సీఐడీ, విజిలెన్స్ విచారణ జరుగుతుందన్నారు. భూదందాతో కూటమి నాయకులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. 84వ వార్డు కమిటీ ఎన్నికను వాయిదా వేశామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ పార్టీ కమిటీ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తామన్నారు. 22న అడ్డురోడ్డులో జరిగే జిల్లా మినీ మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 84వ వార్డు కమిటీ ఎన్నిక సమస్య రెండు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ 42 ఏళ్లుగా పార్టీలో కష్టపడి పనిచేస్తున్న వారికి కమిటీల్లో స్థానం కల్పించాలన్నారు. కోడూరు భూముల విషయంలో రూ.6.32 కోట్లు స్వాహా చేసినట్టు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైందని, ఇందులో కూటమి నాయకులు ఉన్నారని ప్రస్తావించినందున ఆ నాయకులు ఎవరో తేల్చాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు వెనక్కి పోయాయన్నారు. మంత్రి లోకేశ్ కృషితో అనేక పరిశ్రమలు ఏపీకి తరలివస్తున్నాయని వివరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు బీఎస్ఎంకే జోగినాయుడు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్, టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, గొంతిన శ్రీను, బొలిశెట్టి శ్రీనివాసరావు, కాయల మురళీ, కళ్యాణి, కొణతాల రత్నకుమారి, దాడి జయవీర్, బాబర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, సభ ప్రారంభంలో ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్, ఇటీవల మృతి చెందిన టీడీపీ నేతలకు నివాళులుగా మౌనం పాటించారు.

### తీర్మానాలకు సభ ఆమోదం

మినీ మహానాడు సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ ఆమోదించి. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా జిల్లా యంత్రాంగంతో పనిచేయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతూ మాజీ మంత్రి దాడి తీర్మానం ప్రవేశపెట్టారు. అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో కార్డియాలజీ విభాగం ఏర్పాటు, ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి అనకాపల్లిలో ఏర్పాటు, అనకాపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్, నెహ్రూ చౌక్‌లో అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై తీర్మానం ప్రవేశపెట్టగా ఆమోదించారు.

## ఘనంగా దేవతమ్మ పండుగ


భక్తుల పూజలందుకున్న దేవతమ్మ

కశింకోట, మే 19 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కశింకోటలో దేవతమ్మ పండుగను సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. గవర సామాజిక వర్గానికి చెందిన వేగి ఇంటి పేరుతో ఉన్న కుటుంబాలు ఎక్కువగా ఉండడంతో వారంతా ఏటా రెండు రోజుల పాటు ఈ వేడుకను భక్తిశ్రద్ధలతో జరుపుతుంటారు. ఇందులో భాగంగా అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. రంగులను జల్లుకుంటూ ఉత్సాహంగా అంతా ముందుకు సాగారు. మధ్యాహ్నం వారంతా ఒకే వేదికపై సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు అమ్మవారికి పసుపు కుంకుమలను సమర్పించుకున్నారు.


అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తజనం

## ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తికి సతీ వియోగం


వరహ వెంకట సత్యవతి దేవి (ఫైల్ ఫొటో)

కొత్తూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపిశెట్టి రామ్మూర్తి సతీమణి వరహ వెంకట సత్యవతిదేవి విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆమె అవయవాలను జీవన దాన్ ట్రస్టుకు దానం చేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అనకాపల్లి పట్టణంలో ఉన్న గాంధీనగరం స్వగృహం నుంచి మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు వెంకట సత్యవతి దేవి అంతిమయాత్ర ప్రారం భం కానుందని వివరించారు.

## 'ప్రకృతి ఉత్పత్తుల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం'



మలునాయుడుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

సబ్బవరం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సాగుతో మెరుగైన జీవన ప్రమాణాలు సాధ్యమని ప్రకృతి సాగు మండల ఇన్‌చార్జి సీహెచ్.సత్యవతి అన్నారు. మండలంలోని మలునాయుడుపాలెంలో సోమవారం ఖరీఫ్ సీజన్ కార్యాచరణ ప్రణాళిక, ప్రకృతి సాగుపై ఏర్పాటైన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రకృతి సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ ప్రక్రియ వలన ఖర్చులు తగ్గడమే కాకుండా ఆదాయం పెరుగుతుందని, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. ప్రకృతి ఉత్పత్తుల వినియోగం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. 12 కిలోల వరి విత్తనాల బ్యాగ్ రూ.1250, మరో రకం విత్తనాలు రెండు కేజీల బ్యాగ్ రూ200కు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఈ విత్తనాలు జల్లడం వలన నేలలలో కార్బన్ శాతం పెరుతుందని, నేలలో పోషకాలు, జీవ వైవిధ్యం, నీటి సామర్థ్యం, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతాయన్నారు. అంతకుముందు అధికారులు, రైతులు ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోను దేముడమ్మ, కార్యదర్శి త్రిమూర్తులు, వీఏఏ పి.హేమలత, సీహెచ్.సత్యవతి, డీఎంఎం జి.సోమలత, గ్రామ పెద్దలు సబ్బవరపు రవి, వై.లక్ష్మి, ఎల్.శాంతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

### 'మండల పరిషత్' వద్ద సేంద్రియ కూరగాయల స్టాల్


కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

పరవాడ: ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం సేంద్రియ కూరగాయల విక్రయాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బందికి ఈ ఆర్గానిక్ పంటలను పరిచయం చేయడంతో పాటు వారి ద్వారా ఈ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో ప్రతి సోమవారం స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి సంతోషినాయుడు తెలిపారు. టామాటా, వంగ, బెండ, బరబాటి, కాకర, దొండ తదితర వాటితో పాటు పలు రకాల ఆకు కూరలను స్టాల్స్‌లో ఏర్పాటు చేసి విక్రయించారు.

## 'అన్నదాత సుఖీభవ నమోదుకు గడువు పొడిగింపు'


సబ్బవరం సచివాలయంలో ఆధార్ సీడింగ్ ప్యూరిఫికేషన్ చేస్తున్న వీఏఏ జానకి

సబ్బవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు గడువును ప్రభుత్వం పొడిగించిందని మండల వ్యవసాయ శాఖ అధికారి పోతల సత్యనారాయణ చెప్పారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ పథకం కోసం అర్హులను గుర్తించడానికి ఆన్‌లైన్‌లో ల్యాండ్ ప్యూరిఫికేషన్ కార్యక్రమం వేగంగా జరుగుతున్నదని తెలిపారు. మండలంలో 21,362 మంది రైతులకు భూమి ఖాతాలు ఉన్నాయని, ఇప్పటి వరకు 5,200 ఖాతాలకు సంబంధించి ల్యాండ్ ప్యూరిఫికేషన్ పూర్తయ్యిందన్నారు. వాస్తవంగా అన్నదాత సుఖీభవ పథకానికి నమోదు గడువు సోమవారంతో ముగిసిందని, అయితే వెబ్‌సైట్ సర్వర్ సమస్య కారణంగా ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. ఆన్‌లైన్ ల్యాండ్ ప్యూరిఫికేషన్ పూర్తయిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. రైతులు 1బీ రికార్డు, ఆధార్ జెరాక్స్ తీసుకొని తమకు సమీపంలో వున్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఆన్‌లైన్ ల్యాండ్ ప్యూరిఫికేషన్ చేయించుకోవాలని ఏవో సూచించారు. ల్యాండ్ ఆన్‌లైన్‌లో వున్న రైతులే ఈ పథకానికి అర్హులన్నారు. వ్యవసాయేతర భూములు, కోర్టు వివాదాల్లో వున్న భూములకు, ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఈ పథకం వర్తించదని ఏఓ సత్యనారాయణ స్పష్టం చేశారు.

## 'నేటి తరానికి ఆదర్శం సుందరయ్య'

అనకాపల్లి టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : దివంగత సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పలుచోట్ల సోమవారం నిర్వహించారు. ఇక్కడి సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టుగా, అజాత శత్రువుగా పిలవబడే సుందరయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. పార్టీ నాయకులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడ ఊరచెరువు వద్ద పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఉపాధి కార్మికులు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఉపాధి కూలీలు రమణమ్మ, పార్వతి, లక్ష్మి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఉద్యమమే ఊపిరిగా పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా సబ్బవరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, బంగారునాయుడు, రమణ అప్పారావు, గౌరీసు తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లిలో సుందరయ్య చిత్రపటం వద్ద సీపీఎం నాయకుల నివాళి






# ప్రాణాలను హరిస్తున్న రోడ్ హిప్నోసిస్



**కళ్లు తెరిచి ఉన్నా, తెలివి లేకపోవడమే రోడ్ హిప్నోసిస్...**

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

**రోడ్డు బాగుంది. డ్రైవర్ తెలివిగా, అప్రమత్తంగానే ఉన్నట్టున్నాడు. కారు వేగంగా వెళుతోంది. హఠాత్తుగా ముందు వెళుతున్న వాహనాన్నో లేదా ఆగి ఉన్న వాహనాన్నో గుద్దేసింది. ఏం జరిగిందో తెలిసేలోపే ప్రమాదం జరిగిపోయింది. సరదాగా, హాయిగా సాగుతున్న జీవిత ప్రయాణం ఆగిపోయింది. కుటుంబాలు కన్నీటి సాగరంలో మునిగిపోయాయి. ఎందుకు జరిగింది?, ఏం జరిగింది?...అన్న విశ్లేషణలు ఉండవు. వేగం లేదా నిర్లక్ష్యం ప్రమాదానికి కారణంగా నిర్ధారణ జరుగుతుంది. కానీ చాలా ప్రాణాలను గాలిలో కలిపేస్తున్న ఆ భూతం పేరే 'రోడ్ హిప్నోసిస్'.**

### రోడ్ హిప్నోసిస్ అంటే...

రోడ్డు ప్రమాదాలకు అతి వేగం, అజాగ్రత్త, మద్యం సేవించడం, రహదారులు బాగులేకపోవడం... ఇలా అనేక కారణాలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిన మరో అంశం రోడ్ హిప్నోసిస్. జాతీయ రహదారులపై ముందు వాహనాన్ని ఢీకొన్న ఘటనలకు కారణం రోడ్ హిప్నోసిస్ అని నిపుణులు పేర్కొంటున్నారు. అసలు ఈ పదం చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. విద్యావంతులకే దీనిపై అవగాహన లేదు. ట్రక్ డ్రైవర్లకు ఏం ఉంటుంది. రోడ్ మిప్నోసిస్ అంటే 'అర్థం కాని ఓ శారీరక స్థితి'గా నిపుణులు పేర్కొంటున్నారు. ఒక విధంగా చెప్పాలంటే కళ్లు తెరిచి ఉన్నా, తెలివి లేకపోవడమే రోడ్ హిప్నోసిస్. డ్రైవింగ్ ప్రారంభించిన రెండున్నర గంటల తర్వాత ఇది ప్రారంభమవుతుంది. డ్రైవింగ్ చేసేవారు కళ్లు తెరిచే ఉంటారు. కానీ మెదడు విశ్లేషణ చేయడం మానేస్తుంది. ప్రయాణం మాత్రం సాగుతుంది. ఎదురుగా ఉన్న వాహనం ఏ వేగంతో వెళుతుందో అంచనా వేయలేని పరిస్థితి. ఆగి ఉన్న వాహనం కనిపించినా, బ్రేకు వెయ్యాలన్న సంకేతం మెదడుకు అందదు. ప్రమాదం జరగడానికి ముందు పదిహేను నిమిషాల పాటు ఏమీ గుర్తుండదు. సాధారణంగా ఈ ప్రమాదాల్లో వేగం 140 కిలోమీటర్లు ఉంటుంది.

### ఏం చేయాలి

ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం ఉంటుంది. ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవడానికి చిన్నపాటి చిట్కాలు పాటిస్తే చాలు. రెండున్నర గంటల తరువాత డ్రైవింగ్ మరొకరికి అప్పగించాలి. ఒక్కరే డ్రైవింగ్ అంటే ప్రతి రెండున్నర గంటలకు ఓసారి కారు ఆపాలి. నాలుగు అడుగులు అటూఇటూ వేసి, కాసేపు రిలాక్స్ కావాలి. అవకాశం ఉంటే కాసేపు నిద్రపోవడం మంచిది. ఆ సమయంలో ఒకసారి మిమ్మల్ని మీరు పరిశీలించుకోవడం చాలా అవసరం. గడచిన పదిహేను నిమిషాలలో మీరు దాటుకుంటూ వచ్చిన స్థలాలు, వాహనాలు, రోడ్డు సంకేతాలు, ఇతరత్రా ఏమైనా మీ మెదడులో రికార్డు అయ్యాయా లేదో చెక్ చేసుకోవాలి. అవేమీ మీకు గుర్తురావడం లేదంటే మీరు, మీతో పాటు ఉన్నవారిని ప్రమాదం వైపు నడిపిస్తున్నారనే అర్థం. డ్రైవింగ్ చేసే సమయంలో వాహనంలో ఉన్న ఇతర ప్రయాణికులతో మాట్లాడుతూ ఉండడం అవసరం. డ్రైవింగ్ చేసే ముందు తగినంత నిద్ర చాలా ముఖ్యం. బాగా అలసిపోయినప్పుడు, ఒత్తిడి ఉన్నప్పుడు డ్రైవింగ్ చేయకపోవడమే మేలు. రాత్రి సమయంలో అయితే వారికి సరైన నిద్ర అప్పటికే ఉందా లేదా, నిద్ర ఆపుకోగలడా లేదా నిర్ధారించుకోవడం చాలా అవసరం. రోడ్ హిప్నోసిస్ స్థితి సాధారణంగా రాత్రి సమయంలో ఎక్కువగా వస్తుంది. ఆ సమయంలో ప్రయాణికులు కూడా నిద్రపోతుంటారు. డ్రైవింగ్ చేసేవారిని అప్రమత్తం చేసేవారుండరు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చిన కొత్త కార్లలో గేరు మార్చాల్సిన అవసరం లేకుండా, నిర్ణీత స్పీడ్‌లో వెళ్లిపోతున్నాయి. ఈ కార్లలో డ్రైవింగ్ చేసేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి.



- రెండున్నర గంటల డ్రైవింగ్ తర్వాత ప్రారంభం
- మెదడు, కళ్లు చూసిన విషయాలు, విశ్లేషణ ఆగిపోతుంది
- ప్రతి రెండున్నర గంటలకు ఓసారి వాహనాన్ని ఆపాలి
- నాలుగు అడుగులు వేయాలి, రిలాక్స్ కావాలి

### తగిన జాగ్రత్తలతోనే ప్రమాద నివారణ సాధ్యం



డ్రైవింగ్ సమయంలో ఉత్పన్నమయ్యే రోడ్ హిప్నోసిస్ సమస్యకు కారణం ఏమిటన్నది కచ్చితంగా చెప్పలేము. కానీ, సుదూర ప్రాంతాలకు డ్రైవింగ్ చేసే వారిలో ఈ సమస్య ఉత్పన్నం కావచ్చు. కొన్నిరకాల దీర్ఘకాలిక సమస్యలకు మందులు వినియోగించే వారిలో కాస్త దీని తీవ్రత అధికంగా ఉండవచ్చు. కాబట్టి, దూర ప్రాంతాలకు డ్రైవింగ్ చేస్తూ ప్రయాణం చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కనీసం రెండు గంటలకు ఒకసారి ఆగి వెళ్లడం మంచిది. సహచరులతో మాట్లాడుతుండడం అవసరం. వాహనం లైటింగ్ సరిగా ఉండేలా చూసుకోవాలి. డల్ లైటింగ్ ఉంటే ఈ సమస్య మరింత ఎక్కువగా ఉండవచ్చు. ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో కూడా ఇది కనిపిస్తుంది. బ్రెయిన్ యాక్టివిటీ తగ్గడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి, చుట్టుపక్కల యాక్టివిటీస్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సహచరులతో మనస్ఫూర్తిగా మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ద్వారా బ్రెయిన్ యాక్టివిటీ వేగంగా ఉండేలా చేయవచ్చు. తద్వారా డ్రైవింగ్ హిప్నోసిస్ బారినపడకుండా ఉండవచ్చు.

- డాక్టర్ బుచ్చిరాజు, న్యూరాలజీ వైద్య నిపుణులు

## లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

- పలు శాఖల అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. గ్రామ/ వార్డు సచివాలయాల సర్వే, సంపద తయారీ కేంద్రాలు, డ్వామా, హౌసింగ్, సూర్యఘర్, పంచాయతీరాజ్ పనులపై సోమవారం కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే సరఫరా చేయాలని, బోర్లు మరమ్మతుకు అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సంపద తయారీ కేంద్రాలన్నింటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ సమీక్షలో జడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజుకుమార్, డీపీవో ఆర్.శిరీషారాణి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మి, పంచాయతీరాజ్ ఈఈ కేవీ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఎస్ఎఎస్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భారీగా రైళ్ల రీ షెడ్యూల్

- గంటల తరబడి ఆలస్యం
- ప్రయాణికుల అవస్థలు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో సోమవారం పలు రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి గంటల తరబడి ఆలస్యంగా బయలుదేరడంతో విశాఖతోపాటు వివిధ స్టేషన్ల నుంచి గమ్యానికి చేరాలనుకున్న ప్రయాణికులు అవస్థలు పడ్డారు. శాశ్వత ప్రాతిపదికన నడుస్తున్న ప్రధాన రైళ్లను రీ షెడ్యూల్ చేసిన నేపథ్యంలో నిర్ణీత సమయానికి గమ్యానికి చేరుకునే అవకాశం లేక అసహనానికి గురయ్యారు. సోమవారం హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703), హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863), షాలిమార్-చెన్నై సెంట్రల్ వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (02841), షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841), విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583), శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి ప్రత్యేక రైలు (07426) వంటి ప్రధాన రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అలాగే ఆదివారం రాత్రి బయలుదేరాల్సిన హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12863), హౌరా-పాండిచ్చేరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12867), హౌరా-చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12839), బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (12864), హౌరా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18005) రైళ్లను సోమవారం ఉదయం బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. రైలు రీ షెడ్యూల్ చేసిన సమాచారాన్ని ముందుగా మెసేజ్ ద్వారా రైల్వే శాఖ తెలియజేసిన నేపథ్యంలో కొందరు ప్రయాణికులు టికెట్ రద్దు చేసుకుని ప్రత్యామ్నాయ రవాణా మార్గాల ద్వారా గమ్యానికి చేరుకునే ప్రయత్నం చేయగా, మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో గంటల తరబడి నిరీక్షించి ముందస్తు రిజర్వేషన్ పొందిన రైళ్లలో గమ్యానికి చేరుకున్నారు.

## సమస్యల పరిష్కారంలో అర్జీదారులు సంతృప్తి చెందాలి



పీజీఆర్ఎస్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులు సంతృప్తి చెందేలా వారు ఇచ్చిన వినతులకు పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమెతోపాటు డీఆర్ఓ సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులకు సంబంధించిన సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలన్నారు. ఒక వేళ సమస్య పరిష్కరించడానికి వీలుకాని పక్షంలో అందుకుగల కారణాన్ని సంబంధిత అర్జీదారునికి అర్థం అయ్యేలా వివరించాలని సూచించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 370 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

### జిల్లా పోలీస్ కార్యాలయంలో..

అనకాపల్లి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందించే ప్రతి అర్జీ లేదా ఫిర్యాదుపై సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ తుహిన్‌సిన్హా పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అందరి సమస్యలను స్వయంగా ఆలకించి, అర్జీలను పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ శాఖకు అందే అర్జీలను సాధ్యమైనంతవరకు శత శాతం పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. పీజీఆర్ఎస్‌లో 40 అర్జీలు అంది నట్టు జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైమ్) ఎల్.మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## షర్మిల వ్యవహారశైలితో కాంగ్రెస్ నిర్వీర్యం

- విశాఖలో అసమ్మతి నేతల సమావేశం
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ హాజరు
- అగ్రనాయకత్వం దృష్టికి సమస్యను తీసుకువెళతానన్న కిల్లి కృపారాణి



సమావేశంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కిల్లి కృపారాణి. చిత్రంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ ఉన్నారు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యవహారశైలితో పార్టీ నిర్వీర్యమవుతోందని పలువురు నాయకులు విమర్శించారు. షర్మిల నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నాయకులు సోమవారం విశాఖలోని ఒక హోటల్‌లో సమావేశమయ్యారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన నాయకులను షర్మిల పట్టించుకోవడం లేదని పలువురు నేతలు ఆరోపించారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఎటువంటి చర్యలను తీసుకోవడం లేదన్నారు. షర్మిల పగ్గాలు చేపట్టిన తరువాత పార్టీ మరింత అధ్వాన స్థితికి చేరుకుందని ఆరోపించారు.ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ పార్టీలో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, ఇదే విషయాన్ని తనకు తెలియజేశారన్నారు. పార్టీ పెద్దలతో తనకు ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడి పరిస్థితులను తెలియజేయాలని పలువురు కోరారన్నారు. ఈ విషయాలను పార్టీ అధ్యక్షుడు ఖర్గేతోపాటు అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ఆమె వివరించారు. ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న నాయకులతో మాట్లాడేందుకు షర్మిల ప్రయత్నించడం లేదని అన్నారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, సీనియర్ నాయకులు శ్రీరాములు, రుత్తల శ్రీరామమూర్తి, గుత్తుల శ్రీనివాస్, అన్నాజీ, దొమ్మేటి రమణరావు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటేషన్ పేరుతో తిష్ఠ

... 5వ పేజీ తరువాయి

మండలం నుంచి గ్రేడ్-2 హెచ్ఎంను డిప్యూటేషన్‌పై రెండోసారి కొనసాగిస్తున్నారు. ఇదే విభాగంలో కొత్తగా విద్యాశాఖ కంట్రోల్, కమాండ్ విభాగంలో ముగ్గురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్స్, పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు వంటివి వీరు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

### పరీక్షల విభాగంలో....

రాంబిల్లి మండలం నుంచి గ్రేడ్-2 హెచ్ఎం ఒకరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డిప్యూటేషన్‌పై రెండేళ్లుగా కొనసాగుతున్నారు. ఇదే విభాగంలో ఎలమంచిలి నుంచి ఒక ఉపాధ్యాయుడుని డిప్యూటేషన్‌పై నియమించారు. వీరితోపాటు పరీక్షల సమయంలో స్ట్రాంగ్‌రూమ్ ఇన్‌చార్జిగా, స్పాట్ వేల్యుయేషన్ ఇన్‌చార్జిలుగా పలువురు ఉపాధ్యాయులు నెలల తరబడి డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.

### నిరుద్యోగుల ఉపాధికి గండి

వాస్తవానికి విద్యా శాఖలోని వివిధ విభాగాల్లో బోధనేతర పనుల కోసం నాన్‌టీచింగ్ స్టాఫ్ కొరత వుంటే ఆయా సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ విధానంలో తక్కువ వేతనంతో నియమించుకోవచ్చు. కానీ అధికారులు ఆ విధంగా చేయకుండా ఆయా పోస్టుల్లో పెద్ద మొత్తంలో జీతాలు తీసుకుని ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమిస్తూ నిరుద్యోగ యువత ఉపాధికి గండి కొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి డిప్యూటేషన్ పేరుతో జిల్లా విద్యా శాఖలో తిష్ఠ వేసిన టీచర్లను పాఠశాలలకు బదిలీచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## సాగునీటికి భరోసా

... 5వ పేజీ తరువాయి

తొలగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చే సమయానికి ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో సాగునీటి వనరులకు నిర్వహణ, మరమ్మతు పనులు చేయడానికి వీలు కాలేదు. ఈ ఏడాది (2026) కచ్చితంగా పనులు చేయిస్తామని అప్పట్లోనే మంత్రి రామానాయుడు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ మేరకు జల వనరుల శాఖ జిల్లా అధికారులు పంట కాలువల్లో పూడిక తీత పనులకు అంచనాలు తయారు చేసి ఉపాధి హామీ పథకం అధికారులకు (డ్వామా) పంపించారు. గ్రీన్ సిగ్నల్ లభించడంతో రూ.19.85 కోట్ల అంచనాలతో 558 పనులు ప్రారంభించారు. కాలువల్లో పూడికతీత, తుప్పలు తొలగింపు, మదుములకు మరమ్మతు పనులు చేపట్టారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన తాండవ రిజర్వాయర్ కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో రెండు నెలల క్రితమే పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయి. ఇంకా రైవాడ, పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ, రావణాపల్లి రిజర్వాయర్ల పంట కాలువలు, వివిధ గ్రోయిన్లు, చెరువుల కింద వున్న కాలువల్లో పూడిక తీత, తుప్పల తొలగింపు పనులు జోరుగా సాగుతున్నాయి.

## క్రైం... crime news

### మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య



పోలం దేముడు(ఫైల్)

చీడికాడ, మే 19(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని కోనాం గ్రామానికి చెందిన పోలం దేముడు(33), లక్ష్మి దంపతులు శనివారం సాయంత్రం ఇంట్లో గొడవ పడ్డారు. అనంతరం లక్ష్మి నిత్యావసరాల కొనుగోలుకు మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో దేముడు ఇంట్లో చీరతో ఉరి వేసుకున్నాడు. మార్కెట్ నుంచి వచ్చిన లక్ష్మి చూసి వెంటనే కుటుంబ సభ్యులను పిలిచి మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే రోజు అతనిని విశాఖ కేజీహెచ్‌కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. లక్ష్మి స్థానిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సతీశ్ కేసు నమోదు చేసి కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకు వచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దేముడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### 14 మందిపై అట్రాసిటీ కేసు

నక్కపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకాడ గ్రామంలో కులం పేరుతో దూషించినట్టు అందిన ఫిర్యాదు మేరకు 14 మందిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. ఇందుకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి. డొంకాడ గ్రామానికి చెందిన అయినవెల్లి స్వర్ణరాజు, అతని స్నేహితులు దయాసాగర్, గుమ్మడి పోతురాజు, వీధి కిశోర్ ఈ నెల 15వ తేదీన అదే గ్రామంలో జరిగిన ఒక వివాహ వేడుకకు టెంట్, లైటింగ్ ఏర్పాటు చేయడానికి వెళ్లారు. ఈ సమయంలో పెళ్లి కుమారుడు జీని లచ్చబాబు మొబైల్ ఫోన్ పోయింది. దీంతో టెంట్, లైటింగ్ ఏర్పాటు చేయడానికి వచ్చిన వారిపై.. పెళ్లి కుమారుడు, అతని కుటుంబ సభ్యులు ఈ నెల 18వ తేదీన దాడి చేసి, కులం పేరుతో దూషించారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో 14 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ దర్యాప్తు చేపడతారని సీఐ చెప్పారు.

### ఉగ్గినపాలెంలో హత్యపై కేసు నమోదు



మృతుడు అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

కశింకోట, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి గొర్రెల పెంపకందారుల మధ్య జరిగిన గొడవ, కొట్లాటలో పక్కుర్తి అప్పలనాయుడు(65) అనే వ్యక్తి మృతిచెందాడు. దీనిపై అందిన సమాచారం మేరకు సీఐ అల్లు స్వామినాయుడు గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన అప్పలనాయుడుకు, ఇతని బావమరిది ఒమ్మి నూకరాజు, కుమారుడు ఒమ్మి శ్రీనులకు మధ్య గొర్రెల పంపకాల విషయమై ఆదివారం గొడవ జరిగింది. మళ్లీ రాత్రి 9.30 గంటలకు నూకరాజు, శ్రీను కలిసి కర్రలతో అప్పలనాయుడుపై దాడి చేసి కొట్టారు. దీంతో అప్పలనాయుడు చనిపోయాడు. ఇతని కుమారుడు పక్కుర్తి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. నిందితుల కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు.

### బైక్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణ ఎస్ఐ సావిత్రి అందించిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి రేగుపాలెం నుంచి అచ్యుతాపురం వెళుతున్న కారు.. ముబారక్ మండి హోటల్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఎలమంచిలి ధర్మవరానికి చెందిన గోడ రవి, గొల్లవిల్లి శివకుమార్, కె.అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### నర్సీపట్నంలో నకిలీ కరెన్సీ కలకలం



పోలీసులకు అప్పగించిన రూ.500 నకిలీ నోట్ల కట్టలు

నర్సీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ దగ్గర గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఓ ఉపాధ్యాయుడు బైక్‌కి దొంగ నోట్లు ఉన్న బ్యాగ్ తగిలించి వెళ్లిపోవడం కలకం సృష్టించింది. పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలాలా ఉన్నాయి. రావికమతం మండలం కొత్తకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కె.సాంబశివ, నర్సీపట్నం కొత్తవీధిలో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం తన భార్యను బస్సు ఎక్కించడానికి బైక్ మీద ఆర్టీసీ బస్ స్టేషన్‌కి వెళ్లారు. బస్సు ఎక్కించిన తర్వాత ఇంటికి వెళ్లి చూస్తే బైక్‌కు ఒక సంచి తగిలించి ఉంది. దానిలో జీన్ ప్యాంట్, టీ షర్టు కనిపించాయి. వీటి మధ్యలో ఒక కవర్లో చుట్టిన రూ.500 నోట్ల కట్టలు రెండు కనిపించాయి. నిర్ఘాంతపోయిన ఆయన తెలిసిన న్యాయవాది సలహా మేరకు 100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సంచిని అప్పగించారు. సంచిలో ఉన్నవి నకిలీ నోట్లుగా పోలీసులు గుర్తించారు. అనంతరం పోలీసులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌కు సంచిని తగిలించి వెళ్లిపోవడం కనిపించిందని, వారు ఎవరన్నది స్పష్టంగా కనిపించడం లేదని సీఐ గోవిందరావు చెప్పారు.

### బైక్ ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

పెదబయలు, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన అల్లూరి జిల్లా పెదబయలు మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కొల్లి రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన జర్సింగి కార్తీక్ ప్రసాద్ (30) పర్రెడా సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి వద్ద భోజనం చేసి బైక్‌పై విధులకు హాజరయ్యేందుకు బయలుదేరాడు. అతనికి తోడుగా వరుసకు అల్లుడైన బొండా మనోజ్‌కుమార్ (21) కూడా వెళ్లాడు. అడుగులపుట్టు పంచాయతీ కొత్తపుట్టు వంతెన సమీపాన బైక్ అదుపుతప్పి బూరుగుచెట్టును బలంగా ఢీకొని లోయలో పడిపోయింది. సమీపంలోని దుకాణ యజమాని గమనించి గ్రామస్థుల సహాయంతో వారిద్దరినీ బయటకు తీశారు. అప్పటికే మనోజ్‌కుమార్ మృతిచెందాడు. కార్తీక్ ప్రసాద్ కొన ఊపిరితో ఉండడంతో స్థానికులు అంబులెన్స్‌లో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కార్తీక్ ప్రసాద్ తండ్రి రాజుబాబు విశాఖలోని గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ (క్రైమ్)గా పనిచేస్తున్నారు.

### ముత్యాలమ్మపాలెంలో హత్య

... 5వ పేజీ తరువాయి

యర్రయ్య, కొవిరి ముత్యాలు, కొవిరి ముత్యాలమ్మ, శివాజీ, ఆర్మీ ఉద్యోగి ముత్యాలు, ప్రవీణ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కాగా హత్యకు గురైన బంగార్రాజుకు భార్య బంగారం, కుమార్తెలు మధు, గౌతమి ఉన్నారు. సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా బంగార్రాజును హత్య చేసిన కామరాజుతోపాటు అతనికి సహకరించిన వారందరినీ అరెస్టు చేసి, ఉరి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని హతుడి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారిపై ఆందోళనకు దిగారు. సీఐ మల్లికార్జునరావు వచ్చి, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 110.00 |
| లైవ్ ధర | 130.00 |
| విత్ స్కిన్ | 230.00 |
| స్కిన్ లెస్ | 240.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 545 |
| విజయనగరం | 549 |
| శ్రీకాకుళం | 549 |


AJC CLASSIFIEDS

VEHICLES FOR SALE

| | | |
|---|---|---|
| Hyundi Verna BS-IV | 2014 | AP39BX9996 |
| Bajaj Pulsar 150 CC | 2023 | AP40F5649 |
| Maruti Dzire VDI | 2020 | AP39TJ0451 |
| Hero Glamour 120 CC | 2024 | AP40EG6102 |
| Royal Enfield Classic-350 | 2021 | AP39MD0884 |
| Hero Splendour plus | 2023 | AP40BK0309 |
| TATA LPS 4018 | 2016 | AP31TF6444 |

KANAKADURGA FINANCE LTD., GAJUWAKA, VISAKHAPATNAM Cell : 9989621144

CHANGE OF NAME

★ I, SOPPA ANITHA (Old Name), W/o. Sappa Vijaya Babu, resident of D.No.34-5-26, Sabstain Colony, Gnanapuram, Visakhapatnam. Change my name from SOPPA ANITHA (Old Name) to SAPPA ANITHA (New Name). Henceforth I am being called as SAPPA ANITHA (New Name) W/o. Sappa Vijaya Babu, for all purposes.

AJV_ 242231

For Advertisement Contact : 9963231176 9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి